PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 22.02.2013, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 38 పేజీలు : 12, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్
నెలలు తక్కువ బిడ్డా ?
సంరక్షణ కొరకు...
పుట్టిన పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)



Dr. T. Ravikumar's
రిచ్ హాస్పిటల్
రవి చిన్నపిల్లల హాస్పిటల్

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



# మొగ్గ తగ్గిన ఢిల్లీ

- పార్టీ విలీనానికి నిరాకరించిన కేసీఆర్
- తెలంగాణ ప్రకటనకు వెనకడుగేసిన అధిష్టానం



ప్రత్యేకతెలంగాణకు కేంద్రం పచ్చజెండా వూపడానికి సిద్ధపడింది. ఇందుకోసం నీటిపారుదల శాఖ, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులను ఢిల్లీకి పిలిపించుకుని వారితో చర్చలు జరిపింది. రాష్ట్రాన్ని రెండుగా చీలిస్తే జలవనరులు, విద్యుత్ వినియోగం విషయంలో తలెత్తే సమస్యలపై సావధానంగా మాట్లాడింది. తెలంగాణ ఇస్తే తద్వారా చెలరేగే ఆందోళనలను అణచివేయడానికి కేంద్ర పారామిలిటరీ దళాలను కూడా ఆంధ్రాకు పంపించడానికి సిద్ధం చేసింది.

చివరకు రాష్ట్రంలోని వివిధ పత్రికాధిపతులను, ఛానెల్స్ ప్రతినిధులను ఢిల్లీకి పిలిపించుకుని తెలంగాణ ఇవ్వడానికి ప్రణాళిక తయారవుతుంది, దీనికి మీ సహకారం కావాలి... అలాగే రెండు రాష్ట్రాలలోనూ మీరు ప్రసారాలు కొనసాగించేలా, పత్రికలు నడుపుకునేలా సంస్థాగత ఏర్పాట్లు కూడా చేసుకోండి అని చెప్పింది. ఇంత దూరం వచ్చాక ఇక ఎవరైనా తెలంగాణ ఆగుతుందనుకుంటారా? ఖచ్చితంగా వస్తుందనే అనుకుంటారు...

(మిగతా 5వ పేజీలో)

## 'మురళీకృష్ణ' వారి మరో ఆతిథ్య ఆణిముత్యం
# హోటల్ 'నిర్వాణ' శుభప్రారంభం

(వివరాలు 2వ పేజీలో)



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మురళీకృష్ణ హోటల్స్ వారి హోటల్ 'నిర్వాణ' ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, శ్రీమతి సులోచనమ్మ దంపతులను జ్ఞాపికతో సత్కరిస్తున్న గ్రోసు సుబ్బారావు దంపతులు, వీరిశెట్టి హజరత్‌బాబు, గ్రోసు మురళీకృష్ణ, గ్రోసు చైతన్యకృష్ణ

## నెల్లూరుకు జాతీయస్థాయి వన్నెతెచ్చిన
# మహిళల హ్యాండ్‌బాల్ పోటీలు

(వివరాలు 5వ పేజీలో)



ఈ నెల 17వ తేదీన నెల్లూరు విఆర్ హైస్కూల్ మైదానంలో 41వ జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, ఎస్పీ బి.వి.రమణకుమార్, శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఆదాల రాజారామిరెడ్డి, జేసీ లక్ష్మీకాంతం

- చెరొకటి దక్కింది

# సమీకరణ కుదిరింది!



సహకార సంఘాల ఎన్నికల నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీలో నెలకొన్న వర్గపోరు సుఖాంతమైంది. వర్గానికొకటి లెక్కన పదవులను పంచడంతో వర్గపోరుకు తెరదించినట్లయ్యింది.

జిల్లా కేంద్రసహకార బ్యాంకు అధ్యక్షపదవి కోసం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అనుచరుడిగా మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సీఎం కిరణ్ వర్గీయుడిగా ఏడుగుండ్ల సుమంత్‌రెడ్డి తీవ్రంగా పోటీపడ్డారు.

అయితే చివరకు ఇన్‌ఛార్జ్ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో రాజీ పంచాయితీ నిర్వహించి పదవుల






పంపకం ఫార్ములాను ప్రతిపాదించారు.

దీనిప్రకారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ పదవి ఆనం అనుచరుడైన మెట్టుకూరు ధనుంజయరెడ్డికి దక్కగా, సీఎం అనుచరుడైన సుమంత్ రెడ్డికి జిల్లా సహకార మార్కెటింగ్ ఛైర్మెన్ పదవి దక్కింది.

పనబాక లక్ష్మి అనుచరుడిగా వున్న నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి డీసీసీబీ వైస్ ఛైర్మెన్‌గా ఎంపికకాగా, నేదురుమల్లి వర్గానికి చెందిన కె.శ్రీనివాసులురెడ్డి డీసీఎంఎస్ వైస్‌ఛైర్మెన్ కాగలిగారు. డైరెక్టర్ల పదవులను సైతం వర్గాలవారీగా పంచుకోవడం విశేషం!

PDF Compressor Free Version



## 'మురళీకృష్ణ'కారి మరో ఆతిథ్య ఆణిముత్యం
# హోటల్ నిర్వాణ శుభప్రారంభం

నెల్లూరంటే ఆధ్యాత్మికతలో రంగనాయకులస్వామి దేవస్థానం... ప్రకృతికి పినాకినినదీ తీరం... వినోదానికి మూడుహాళ్లు, వైద్యానికి రామచంద్రారెడ్డి హాస్పిటల్... ఇవీ బ్రాండ్‌లు. నెల్లూరు ఆతిథ్యానికి మాత్రం బ్రాండ్ అంబాసిడర్ మురళీకృష్ణ హోటల్స్. గత నాలుగు దశాబ్దాలుగా ఆతిథ్యరంగంలో ఈ హోటల్ అందిస్తున్న సేవలు నిరుపమానం. బయటప్రాంతాల నుండి ఎవరు నెల్లూరొచ్చినా మురళీకృష్ణ వంటకాలు రుచిచూడకుండా బస్సు, రైలు ఎక్కరంటే అతిశయోక్తికాదు.

నెల్లూరు నగరంలో అత్యంత వేగంగా, వాణిజ్య, వ్యాపార సముదాయంగా అభివృద్ధి చెందుతున్న మాగుంట లేఅవుట్ వాసులకు సైతం తమ ఆతిథ్యసేవలను అందించాలనే లక్ష్యంతో మురళీకృష్ణ గ్రూప్ హోటల్స్ వారి మరో బ్రాంచ్‌ను ఇక్కడ 'మోర్' సూపర్‌మార్కెట్ పైభాగంలో 'హోటల్ నిర్వాణ' పేరుతో నిర్మించారు. ఈ నెల 17వ తేదీన దీనిని అతిథిదేవుళ్లకు అంకితం చేసారు. ఈ ప్రారంభోత్సవంలో మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకులు, అన్నదాత గ్రోసుగోపాలయ్యతో పాటు ఆయన కుటుంబసభ్యులు వీరిశెట్టి హజరత్‌బాబు, సుబ్బారావు, చైతన్యకృష్ణ, మురళి, మురళీకృష్ణ హోటల్ కుటుంబసభ్యులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పేరులోనే కాదు నిర్మాణశైలిలోనూ హోటల్ 'నిర్వాణ' విభిన్నంగా రూపుదిద్దుకుంది. స్టార్ హోటల్స్‌కు దీటుగా అతిథులను ఎంతగానో ఆకర్షించేలా అందమైన డిజైన్‌లతో, అందరి నోరూరించే రుచులతో హోటల్ నిర్వాణ అందరినీ అలరిస్తూ, ఆహ్వానిస్తుంది.



## అన్నదాతల అండతోనే...
# సహకార విజయం

కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల రైతులు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు సహకార ఎన్నికల విజయాలే ఉదాహరణ అని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ శాఖలకు కొత్తగా ఎన్నికైన పాలకవర్గాలకు మంగళవారం రాత్రి నెల్లూరు ఏ.సి. సెంటర్‌లో పెద్దఎత్తున అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనంతగా మన జిల్లాలో జరిగిన సహకార ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారన్నారు. రానున్న స్థానికసంస్థలు, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్సే గెలుస్తుందని చెప్ప డానికి ఇది శుభసంకేతమన్నారు. కాంగ్రెస్ పట్ల రైతులు పెట్టుకున్న నమ్మకం, ఆశలకు సహకార ఎన్నికలు అద్దంపట్టాయి. రైతులు చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదు. ఆయన పాదయాత్ర అంటూ ఎన్నివేల మైళ్లు



సభలో ప్రసంగిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

తిరిగినా ఫలితం లేదు. ఆయన పాద యాత్ర రికార్డులలో వ్రాసుకోవడానికి తప్పితే ఇంకెందుకు ఉపయోగపడదని మంత్రి ఎద్దేవా చేసారు. వైయస్సార్ కాంగ్రెస్ కూడా రైతుల విశ్వాసం పొందలేక పోతుందని, రైతుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేస్తున్నాయి కాబట్టే రైతులు కాంగ్రెస్‌పార్టీ పక్షాన నిలుస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

ఈ సభలో ఇంకా జిల్లా పరిశీలకులు తిప్పేస్వామి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, పనబాక కృష్ణయ్య, చాట్ల నరసింహారావు, భానుశ్రీ, ఆనం విజయకుమార్‌రెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, రవికుమార్ యాదవ్, వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, టి.రమణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వై.సుమంత్‌రెడ్డి, ఇతర డైరక్టర్లను మంత్రి, ఇతర నాయకులు ఘనంగా సన్మానించారు.




## జె.కె.కు హరివిల్లు
# లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డ్

మాజీశాసనసభ్యులు, ప్రజల మనిషి జె.కె.రెడ్డికి హరివిల్లు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేయనున్నారు. మార్చి 17వ తేదీ నెల్లూరు టౌన్‌హాలులో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకుంటారు. గతంలో సిపిఆర్ కళ్యాణ మండపం అధినేత చెరుకుపల్లి పిచ్చిరెడ్డి, దంతవైద్యులు డాక్టర్ జి.కొండారెడ్డిలు ఈ అవార్డును అందుకొని వున్నారు.



## ప్రజల్లోకి వైసీపీ..

## నిర్వేదంలో టీడీపీ



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో అంతర్గతంగా నెలకొన్న విభేదాలు పార్టీకి మాత్రం మంచే చేస్తున్నాయి. నాయకుల మధ్య నెలకొన్న పోటీతత్వం, సీట్ల కోసం వెంపర్లాట వెరసి ఆ పార్టీ నాయకులను జనంలోకి తరుముతుంటే అదే సమయంలో ప్రధానప్రతిపక్షం తెలుగుదేశంలో మాత్రం నిరాశ, నిర్వేదం అలుముకుంటుంది. పార్టీ అనాథలా మారుతుందంటూ ఇటీవల ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలోనే నాయకులు తమ బాధను వెళ్లబోసుకోవడం గమనార్హం.

జిల్లాలో చూస్తే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో వున్నంతగా వర్గపోరు కాంగ్రెస్, తెలుగుదేశంలలో కూడా లేదు. అయితే నాయకులు వైసిపిలో వున్నంత హుషారుగా ఈ రెండు పార్టీలలో లేరు. టిక్కెట్ల పోటీవల్లనైతేనేమీ, ఇంకో కారణం చేతనైతేనేమీ ఆ పార్టీలో నాయకులు తలా ఒక పేరుతో పాదయాత్రలు చేస్తున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇప్పటికే 141రోజుల పాటు పాదయాత్రను నిర్వహించి వున్నారు. కాగా అదే నియోజకవర్గంలో ఇప్పుడు 'ప్రజాబంధం' పేరుతో ఆనం వెంకటరమణారెడ్డి పాదయాత్ర మొదలుపెట్టాడు. వైయస్సార్ కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా 'ప్రజాదీవెన' పేరుతో సర్వేపల్లి నియోజకవర్గంలో పాదయాత్రకు శ్రీకారం చుట్టాడు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని ఆయన చుట్టబోతున్నాడు. నెల్లూరు నగరంలో అనిల్‌కుమార్‌యాదవ్ కూడా పాదయాత్రకు శ్రీకారం చుట్టాడు. కావలి (మిగతా 5వ పేజీలో)

# గ్రామయుద్ధానికి పచ్చజెండా

- జిల్లాలో 46జడ్పీటీసీ, 1096 ఎంపిటిసి స్థానాలకు త్వరలో ఎన్నికలు
- 956మంది సర్పంచ్‌ల ఎన్నికకు కసరత్తు చేస్తున్న అధికారులు
- ఇప్పటికే దాదాపుగా పూర్తయిన రిజర్వేషన్లు
- సగం స్థానాల్లో మహిళలకు అవకాశం

ఎట్టకేలకు స్థానిక సంస్థల ఎన్నికలకు సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏడాదిన్నర కాలంగా న్యాయస్థానంలో నలుగుతున్న రిజర్వేషన్ ప్రక్రియకు సంబంధించి కోర్టు నిర్ణయం తీసుకుని పాతరిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. 2001 జనాభా లెక్కల ప్రకారమే ఎన్నికలను నిర్వహించాలని, ఆ జనాభా నిష్పత్తి ప్రకారమే రిజర్వేషన్లు కూడా ఖరారుచేయాలని సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వానికి సూచించింది. 2006 మేలో చివరిసారిగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగగా 2011 జూన్ నాటికి గ్రామ ప్రథమ పౌరుల పదవీకాలం పూర్తయింది. అప్పటి నుంచి 956మంది సర్పంచ్‌లు మాజీలయ్యారు. అదే విధంగా 1096 ఎంపిటీసీలు 46జడ్పీటీసీలు స్థానాలకు కూడా ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు జరుగకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో పాలన గాడితప్పింది. అయితే ఈ ఎన్నికల్లో సగం మంది మహిళలకు పదవులు పొందే అవకాశం మొదటిసారిగా రానుంది. స్థానిక సంస్థల్లో 50శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తెచ్చిన చట్టం మొదటిసారిగా ఈ ఎన్నికల్లో అమలు కానుంది. దీంతో మహిళలు పెద్దసంఖ్యలో స్థానికసంస్థల్లో కొలువుతీరనున్నారు. ప్రధాన రాజకీయపార్టీలకు చెందిన గ్రామస్థాయి నాయకులు కూడా స్థానిక సంస్థల ఎన్నికల కోసం నిరీక్షిస్తున్న తరుణంలో కోర్టు పచ్చజెండా ఊపడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు జిల్లాలో కొన్ని ప్రాంతాలకు పరిమితం కాగా ఇప్పుడు ప్రతి పల్లెలో ఎన్నికల వాతావరణం కనిపించనుంది.

## వద్దంటే వచ్చిన వాన!



# నిండా ముంచింది

ప్రజలంతా కళ్లల్లో వత్తులు వేసుకుని ఆకాశంకేసి దీనంగా ఎదురుచూసిన సమయంలో మాత్రం వర్షాలు పడలేదు. కాని కాలంకాని కాలంలో అకాలవర్షాలు వచ్చి రైతులను నిండా ముంచాయి. పడాల్సిన సమయంలో వానలు పడితే రైతులకు ఆనందం. అవసరంలేని కాలంలో పడితే అనర్థం.

ఇప్పుడు జిల్లాలో అదే జరిగింది. గత నవంబర్, డిసెంబర్‌లలో కొద్దిపాటి వర్షాలు కురిసాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3లక్షల ఎకరాలలో వరి వేసి వున్నారు. ఉన్న నీటినే వాడుకుంటూ రైతులు పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. పైరు పెరిగే కొద్దీ రైతుల్లో ఆనందం, ఆశలు పెరుగుతున్నాయి. రైతన్నలు సంతోషంగా వుండడం చూసి ప్రకృతికి కన్నుకుట్టిందో, వరుణదేవుడికి ఒళ్లు మండిందో ఏమోగాని ఈ నెల 16వ తేదీన అకాలవర్షం విరుచుకుపడింది. జిల్లా వ్యాప్తంగా ఆరోజు కురిసిన వర్షాల దెబ్బకు జిల్లాలో వేలాది ఎకరాలలో నారుమళ్లు దెబ్బతిన్నాయి. దాదాపు 5వేల హెక్టార్లలో కోతకొచ్చిన వరిపైరు దెబ్బతింది. వెయ్యి ఎకరాలలో మామిడిపూత రాలిపోగా, 7వేల హెక్టార్లలో వేరుశెనగ, 4వేల హెక్టార్లలో పొగాకు పంట దెబ్బతింది. మిరపకాయ, మినుము వంటి పంటలకు సైతం నష్టం వాటిల్లింది. కోతకొచ్చిన పైర్లు నేలరాలడంతో రైతుల బాధ అంతా ఇంతా కాదు.





ప్రపంచంలోని అగ్రరాజ్యాలు సైతం అసూయచెందేంతటి యువశక్తి భారత్ సొంతం. ఎన్నో దేశాలు వృద్ధాప్యంతో అల్లాడుతుండగా మన దేశం మాత్రం 65శాతం యవ్వనత్వంతో నిండిపోయింది. మరి ఇలాంటి దేశంలో యువత ఏ మార్గంలో పయనిస్తుంది?

# మైనర్స్.... క్రైమ్‌కిల్లర్స్

## కత్తులతో సావాసం

మూడుపదుల నూనూగుమీసాల వయసులో స్వామి వివేకానంద ప్రపంచానికే ఆధ్యాత్మిక బోధన చేసాడు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌సింగ్‌లు ఉరితాడును ముద్దాడారు. యుక్తవయసులోనే అభిమన్యుడు ధర్మం కోసం పోరాడి ప్రాణాలు కోల్పోయాడు. పల్నాటి బాలచంద్రుడు తన ప్రజల కోసం వీరమరణం పొందాడు. ఇదంతా చరిత్ర. మరి వాస్తవాలను చూస్తే... మూడుపదుల వయసు నిండకముందే సచిన్ టెండూల్కర్ క్రికెట్ చరిత్రలో వున్న ఎన్నో రికార్డులను తునాతునకలు చేసాడు. సైనానెహ్వాల్ ఒలంపిక్ పతకాన్ని ముద్దాడగలిగింది.

వీళ్లంతా యువతరం. సమాజంలో యువత రెండుగా చీలిపోయింది. ఓ రకం యువత ఉద్యోగాల వేట, ఉపాధిబాట పడితే ఇంకో రకం యువత నేరగ్రస్థ మార్గాన్ని ఎంచుకుంటుంది. కలలను సాకారం చేసుకోవాల్సిన వయసులో, కన్నవారి కలలను నెరవేర్చాల్సిన దశలో కత్తులు పట్టి తమ రాతలనే కాదు, అన్నెంపున్నెం ఎరుగని అమాయకుల తలరాతలను కూడా మార్చేస్తుంది. ఎన్నో జీవితాలను చిదిమేస్తుంది.

అంతర్జాతీయ సమాజాన్నే నివ్వెరపోయేలా చేసిన ఢిల్లీ గ్యాంగ్‌రేప్ నిందితులు ఆరుగురులో ఎక్కువమంది యువకులే! వీరిలో 18ఏళ్లు నిండని మైనర్ బాలుడు వుండడం ఆశ్చర్యకరమైన విషయమైతే ఆ మైనరే అందరికంటే రాక్షసత్వంగా ప్రవర్తించడం సభ్యసమాజాన్ని నోరెళ్ల బెట్టేలా చేసింది. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న కిడ్నాప్‌లు, అమ్మాయిలపై యాసిడ్‌దాడులు, హత్యలు, దోపిడీలు వంటి నేరాలలో ఎక్కువశాతం పాల్గొంటున్నది యువతే!

నెల్లూరుజిల్లాలో సైతం ఇటీవల వెలుగుచూస్తున్న నేరాలలో అధికశాతం మంది నిందితులు యువకులే! ఇటీవల నెల్లూరు హరనాథపురం రెండోవీధిలో జరిగిన తల్లీకూతుళ్ల హత్యకేసులో నిందితులైన ముగ్గురు యువకులకు కూడా పట్టుమని పాతికేళ్లు దాటలేదు. ఈ వయసులోనే వీరికి ఇంత కర్కశత్వం ఎలా వచ్చింది. ఇంత రాక్షసత్వంగా ఎలా ఆలోచించగలుగుతున్నారు? నల్లులను నలిపినంత సులభంగా తల్లులను, వారి పిల్లలను ఎలా చంపగలుగుతున్నారు? సమాజం పదేపదే అడుగుతున్న ప్రశ్నలివే!


నేటి యువత మంచి కంటే కూడా చెడువైపు తొందరగా ఆకర్షించబడుతోంది. ఉత్సవాలప్పుడు దేవాలయం వద్ద భరతనాట్యం వుంది... చూసొద్దాం రా అంటే మన యువతకు నిద్ర ముంచుకొస్తుంది. అదే బస్టాండ్ సెంటర్‌లో రికార్డు డ్యాన్స్ ఏర్పాటు చేసారంటే కళ్లల్లో వత్తులు వేసుకునైనా తెల్లవారే దాకా చొంగ కార్చుకుంటూ చూస్తారు. థియేటర్‌లో ఆధ్యాత్మిక విలువలు పెంచే 'షిరిడిసాయి' సినిమానో, సాంఘిక భావాలు పెంచే 'ఆ నలుగురు' వంటి సినిమాలు వారానికి మించి ఆడవు. అదే 'దూకుడు', 'పోకిరి', 'దమ్ము' వంటి హింసాత్మక సినిమాలనైతే మొదటిరోజే చూసేందుకు టిక్కెట్ల కోసం పెద్దయుద్ధమే చేస్తారు. టెన్త్‌క్లాసుకే గర్ల్‌ఫ్రెండ్... ఇంటర్‌లోనే ఫారిన్‌స్కాచ్ బ్రాండ్... ఇదీ నేటి యువకుల లేటెస్ట్ ట్రెండ్. తిరగడానికి పల్సర్‌స్పోర్ట్స్ బైక్... తాగడానికి జేబులో ఎప్పుడూ గోల్డ్‌ఫ్లేక్... ఇదీ ఎప్పుడూ వుండే స్టైల్. ఇక సినిమాలు, షికార్లు, ఫ్రెండ్స్‌తో మందుపార్టీలు నిత్యకృత్యం. తల్లిదండ్రులు మా అబ్బాయి చాలా మంచోడు అనుకుంటూ పాకెట్ మనీ క్రింద పదిరూపాయలు చేతిలో పెడతారు. ఆ డబ్బుతో మనోడికి రెండు సిగరెట్లు కూడా రావు. ఇక జల్సాలకు డబ్బు ఎక్కడనుండి తేవాలి. ఈ ప్రశ్న వచ్చిందే తడవు మన నవయువకులు, భావిభారత ఖైదీలు స్వయంఉపాధి పథకాలను ఎంచుకుంటున్నారు. అదేంటంటే... రోడ్లల్లో వెళ్లే మహిళల మెడల్లో గొలుసులు తెంపుకు పోవడం, ఇళ్లల్లోకి పోయి కత్తులతో ఆడవాళ్లను బెదిరించి నగలు, నగదు దోచుకోవడం, పసిపిల్లలను కిడ్నాప్ చేసి వారి తల్లిదండ్రులను భారీగా డబ్బు డిమాండ్ చేయడం.

యువత చెడిపోవడానికి చెడువ్యసనాలు, చెడు సావాసాలే కాదు మన మీడియా కూడా దోహదపడుతూనే వుంది. హరనాథపురం జంట హత్యల కేసులో ప్రధాననిందితుడు ఇంతియాజ్ ఇటీవలే వచ్చిన 'దండుపాళ్యం' సినిమాను పదిసార్లు చూసారట. ఎస్పీగారే ఈ విషయాన్ని వెల్లడించారు. పీకలు కోసి మనుషులను ఎంత (మిగతా 5వ పేజీలో)




PDF Compressor Free Version






## ఐపిఎస్‌ను వేరు చేయండి

సివిల్ సర్వీసెస్ నుండి ఐపిఎస్‌ను వేరు చేయడం మంచిది. ఐఏఎస్, ఐఆర్ఎఎస్, ఐఎఫ్ఎస్ వంటి సర్వీసులకు ఐపిఎస్ సర్వీస్‌కు ఎంతో తేడా వుంది. ఐపిఎస్‌కు ఎంపికై పోలీసు వృత్తిలో పనిచేయాలని ఆసక్తి వున్న వారినే ఐపిఎస్ ఎంట్రన్స్‌కు తీసుకోవాలి. దీనివల్ల మంచి అధికారులు వచ్చే అవకాశముంది.

ఎస్.కె.నాగూర్‌వలి,
నెల్లూరు.

## ఆ గంతులేంటి?

దివంగతనేత డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డిని కోట్లాదిమంది అభిమానిస్తున్నారు. కాని ఆయన అల్లుడు బ్రదర్ అనిల్‌కుమార్ మాత్రం మతసభల పేరుతో నిర్వహించే వేదికలపై సినిమా డ్యాన్స్‌లు వేస్తున్నాడు. ప్రజాజీవితాలలో వున్న కుటుంబసభ్యులు ఇలా మతాల పట్ల పక్షపాతం చూపడం తగదు.

సి. రాజీవి, నెల్లూరు.

## భార్గవిలా బలికాకూడదు

నెల్లూరులో వైద్యవిద్యార్థిని భార్గవి హత్య చాలా దారుణం. డబ్బు కోసం కిరాతకులు భావివైద్యురాలిని పొట్టనపెట్టుకున్నారు. భార్గవి డాక్టరై ఎంతోమందికి వైద్యసేవలు అందించి వుండేది. ఆమెను చంపిన కిరాతకుల వల్ల సమాజానికి ఎటువంటి లాభం లేదు.. నష్టం తప్పితే! శరీరానికి క్యాన్సర్ వస్తే చెడిపోయిన భాగాన్ని ఆపరేషన్ చేసి ఎలా తొలగిస్తారో, ఇలాంటి కుళ్లిపోయిన నిందితులను కూడా ఎన్‌కౌంటర్‌లు చేసి ఏరిపారేయాలి.

టి. సుజాత, చెన్నై.

## దుబారా తగ్గించండి

ఈమధ్య వివాహావేడుకలు మరీ ఖరీదయ్యాయి. డెకరేషన్ సెట్టింగ్‌లకు లక్షలు తగలేస్తున్నారు. ఒక్కో మనిషి భోజనానికి 300 రూపాయల నుండి వెయ్యిరూపాయలు ఖర్చుపెడుతున్నారు. ఇదంతా ఆడంబరం కోసమే! ఈ ఖర్చును మిగిలించి ఆ డబ్బుతో ఏదో ఒక మంచిపని చేయొచ్చుగా! ఎక్కడన్నా ఒక వేడుక అయిపోయిందంటే మిగిలిన ఆహారాన్ని కుప్పతొట్ల వద్ద పారేస్తుండడం బాధాకరం.

కొనపల్లి మహేష్,
పొదలకూరు.

# 'ప్రభా'తం

పంచశీలసూత్రాలు, అలీన విధానం, సోషలిజం, పంచవర్ష ప్రణాళికలు, సాగునీటి ప్రాజెక్టులు వంటి నిర్మాణాత్మకమైన అభివృద్ధితో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పరిపాలనా విధానం ఆకట్టుకుంది. బ్యాంకుల జాతీయీకరణ, జమీందారీ సంస్థానాల రద్దు, పాకిస్థాన్, చైనా యుద్ధాలలో విజయాలు, తీవ్రవాదంపై ఉక్కుపాదం వంటి అద్భుతాలు ఇందిరాగాంధీ హయాంలో జరిగాయి. ప్రధానిగా రాజీవ్‌గాంధీ సాంకేతిక విప్లవానికి బాటలు వేస్తే, పి.వి.నరసింహారావు సరికొత్త సంస్కరణలతో భారత ఆర్థికవ్యవస్థను కొత్తపుంతలు తొక్కించారు. ప్రధానిగా వాజ్‌పేయి హయాంను చూస్తే నాలుగులైన్లుగా జాతీయ రహదారుల అభివృద్ధి, అణుపరీక్షలు, కార్గిల్ యుద్ధం, సాంకేతిక అనుసంధానం వంటి విజయాలు గుర్తుకు వస్తాయి.

మరి ప్రధానిగా 9ఏళ్ల మన్మోహన్‌సింగ్ పరిపాలనను తీసుకుంటే ఏమేం గుర్తుకువస్తాయి. కామన్‌వెల్త్ క్రీడల్లో అవినీతి, ఆదర్శ్ హౌసింగ్ స్కాం... లక్షా80వేల కోట్ల స్పెక్ట్రం కుంభకోణం.. తాజాగా అగస్టావెస్ట్ ల్యాండ్ హెలికాప్టర్‌ల కొనుగోలులో అక్రమాలు. మన్మోహన్‌సింగ్ నిజాయితీపరుడు. అన్యాయంగా రూపాయి కూడా సంపాదించివుండడు. మరి ఆయన హయాంలోనే వేలకోట్ల విలువచేసే కుంభకోణాలు చోటుచేసుకోవడం ఆయన దురదృష్టమేననుకోవచ్చు.

భారత రక్షణశాఖ భక్షణశాఖగా మారింది. ఇది దేశ భద్రతకే పెను ఉపద్రవంగా మారబోతుంది. నాటి బోఫోర్స్ కుంభకోణం నుండి నేటి అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్‌ల కొనుగోలు వరకు రక్షణశాఖలో చోటుచేసుకుంటున్న అవకతవకలు, కమీషన్‌ల కక్కుర్తి వ్యవహారాలు చూస్తుంటే దేశ భద్రత ప్రశ్నార్థకమవుతుంది. బోఫోర్స్ మరుగునపడినా దాని వాసనలు ఇంకా పూర్తిగా పోలేదనిపిస్తుంది. ముఖ్యంగా ఇటలీకి ఇండియాకు మధ్య రక్షణ కుంభకోణాల విషయంలో ఎడతెగని అనుబంధమేదో వుందని అనుమానించాల్సి వస్తుంది. సోనియాగాంధీ మన దేశపు కోడలిగా మారింది కాబట్టి ఇండియా-ఇటలీల మధ్య బంధుత్వం వుందనుకుందాం. మరి రక్షణశాఖ పరంగా జరిగే ఒప్పందంలో వెలుగుచూసిన అక్రమాలలో సైతం ఇటలీ లింకులు వుండడం ఆశ్చర్యం కలిగించే విషయం. రాజీవ్‌గాంధీ హయాంలో రక్షణశాఖలోకి బోఫోర్స్ భూతం ప్రవేశించింది. బోఫోర్స్ శతఘ్నుల కొనుగోలులో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకోవడం, మీడియా ద్వారా అవి వెలుగులోకి రావడం జరిగింది. ఇప్పుడు వెలుగుచూస్తున్న లక్షల కోట్ల కుంభకోణాలతో పోల్చిచూస్తే బోఫోర్స్ కుంభకోణం విలువ తక్కువే. కాని భారత రాజకీయ చరిత్రలో అది ప్రభావం చూపినంతగా ఇంకే కుంభకోణం ప్రభావం చూపలేదు. జాతీయ రాజకీయాలలోనే పెనుమార్పులు తీసుకొచ్చింది కుంభకోణం. జాతీయస్థాయిలో కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలనన్నింటిని ఒకే వేదికపైకి చేర్చింది. కేంద్రంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసి నేషనల్ ఫ్రంట్ అనే కొత్త ప్రభుత్వం రావడానికి ప్రధానకారణం ఈ కుంభకోణమే. అయితే ఈ కుంభకోణ విచారణ బాధ్యతలను సిబిఐకి అప్పగించడం, ఏళ్ల కాలాలపాటు దర్యాప్తు సాగించిన తర్వాత ఇటలీకి చెందిన ప్రధాననిందితుడు ఖత్రోచిని దేశం విడిచి వెళ్లిపోయేలా చేసి, ఆ తర్వాత ఈ కేసుకు సమాధికట్టేయడం జరిగింది.

ఇక ఎన్డీఏ హయాంలో చూసినా రక్షణ కొనుగోళ్లలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. కార్గిల్ యుద్ధవీరుల మృతదేహాలను వుంచడానికి కొనుగోలుచేసిన శవపేటికల విషయంలో సైతం రక్షణశాఖలో శవాలమీద చిల్లర ఏరుకునేవాళ్లు వున్నారన్నది అర్థమైపోయింది. తెహల్కా డాట్ కామ్ ఆపరేషన్‌లో ఫారిన్ స్కాచ్ బాటిల్ ఇస్తే రక్షణ రహస్యాలు వెల్లడించే అధికారులు రక్షణశాఖలో వున్నారన్నది బట్టబయలైంది.

ఈమధ్య రక్షణశాఖలో 600 టెట్రాట్రక్కుల కొనుగోలు వ్యవహారం పెను దుమారాన్ని రేపడం తెలిసిందే! రక్షణ నిఘా సంస్థ మాజీడైరెక్టర్ జనరల్‌పైనే ట్రక్కు కొనుగోళ్ల లంచాల ఆరోపణలు వచ్చాయి. కాగా ఇప్పుడు అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్‌ల కొనుగోలులో చోటుచేసుకున్న అక్రమాలు జాతిని నివ్వెరపోయేలా చేసాయి. 3600కోట్ల విలువచేసే హెలికాప్టర్ల విక్రయ కాంట్రాక్ట్‌ను దక్కించుకునేందుకు ఇటలీ సంస్థ 'ఫిన్‌మెకానికా' మొత్తం ఒప్పందంలో భారత రక్షణ అధికారులకు 10శాతం లంచం ఎరగా వేసిందని ప్రధాన ఆరోపణ. దీనిపై ఇటలీ గత కొంత కాలంగా దర్యాప్తు జరుపుతూనే వుంది. ఫిన్‌మెకానికా సంస్థ సిఇఓను నిర్బంధించి ఇటలీ దర్యాప్తు చేపట్టింది. ఈ కుంభకోణం మీద ఇటలీ వేగంగా దర్యాప్తు జరిపి నిందితులను అరెస్ట్ చేస్తుంటే, మన దేశంలో మాత్రం ఇంకా దానికి సంబంధించిన పూర్తి ఆధారాలు, సమాచారం లేదంటూ కేంద్ర ప్రభుత్వం యాధాఫలంగా నీరుగార్చే ప్రయత్నం చేస్తూనే వుంది.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని వంటి అత్యున్నత ప్రముఖుల కోసం పన్నెండు హెలికాప్టర్లు కొనాలని 12ఏళ్ల క్రితం రక్షణశాఖ నిర్ణయించింది. అగస్టావెస్ట్‌ల్యాండ్, సికోర్సి, ఎస్-92 హెలికాప్టర్లు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలకు ధీటుగా లేవని ఎన్డీఏ ప్రభుత్వం ఆ ఫైలును పక్కనపెట్టింది. అమెరికా సైతం అగస్టా వెస్ట్‌ల్యాండ్‌ల కొనుగోలుకు వెనకడుగువేసింది.

కాని ఎన్డీఏ దిగిపోయి యూపిఏ అధికారంలోకి రాగానే ఈ హెలికాప్టర్‌ల కొనుగోలు ఫైలు దుమ్ము దులిపారు. ఎవరికి ఏ అవసరమొచ్చిందో ఏమోగాని ఆఘమేఘాలమీద 3600కోట్లు చెల్లించి అగస్టా హెలికాప్టర్‌లు కొన్నారు, ఇండియా రక్షణశాఖ అధికారులతో పాటు ఇక్కడి ప్రజాప్రతినిధులలో దాగున్న అవినీతి బలహీనతను ఫిన్‌మెకానికా సంస్థ బాగానే సొమ్ము చేసుకుంది. గత ఎన్డీఏ ప్రభుత్వంగాని, అమెరికా దేశంగాని మాకొద్దని తిరస్కరించిన నాసిరకం హెలికాప్టర్‌లను కొనుగోలుచేసింది. ఇటలీ ఆయుధాలు మనకు అచ్చిరావని తెలిసి కూడా ఇటలీతో రక్షణ ఒప్పందాలకే మనవాళ్లు మొగ్గుచూపుతున్నారు.

ఈ కుంభకోణం దర్యాప్తు అయినా సక్రమంగా సాగుతుందో, బోఫోర్స్ లాగా మూతపడుతుందో ఆ దేవుడికే తెలియాలి.

## పాపాలగుట్ట



కేంద్రంలోని మన్మోహన్‌సింగ్ సర్కార్ ఒక చారిత్రాత్మక రికార్డును సొంతం చేసుకోబోతుంది. దేశచరిత్రలోనే ఏ ప్రధాని హయాంలో జరగనన్ని కుంభకోణాలను మన్మోహన్‌సింగ్ తన ఖాతాలో వేసుకోబోతున్నాడు. ఈ ప్రభుత్వంలో కుంభకోణాలు సాధారణ విషయంగా మారిపోవడం విచారకరం.

# 'అంతర్'జాతీయం

- రష్యా గగనతలంలో ఈ నెల 15వ తేదీ సంభవించిన ఉల్కాపాతంతో దాదాపు వెయ్యిమంది గాయపడ్డారు. ఈ ఉల్కాపాతంతో అణుబాంబు కంటే అత్యధికశక్తి విడుదలైందని నాసా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.
- మాల్దీవుల మాజీఅధ్యక్షుడు మొహమ్మద్‌నషీద్ వ్యవహారంలో ఆ దేశం భారత రాయబారి డిఎం ములేకు సమన్లు జారీచేసింది. అరెస్ట్‌ను తప్పించుకునేందుకు నషీద్ భారత రాయబార కార్యాలయంలో ఆశ్రయం పొందుతున్నారు.
- చర్చికి పునరంకితమవ్వాలని రోమన్ కేథలిక్ మతాధిపతి పోప్‌బెనడిక్ట్-16 పిలుపునిచ్చారు. ఆదివారం వాటికన్‌సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద నిర్వహించిన ఏంజలస్ ప్రార్థనల్లో ఆయన ప్రసంగిస్తూ దైవమార్గం నుంచి పక్కదోవ పట్టించే దుష్టశక్తులపై యుద్ధానికి చర్చి సభ్యులంతా సిద్ధం కావాలన్నారు. పోప్ పదవికి ఆయన ఈ నెల 28న రాజీనామా చేయనున్నారు.
- ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మెన్ మార్కండేయకట్జూ కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకునేలా పనిచేస్తున్నారని బీజేపీ సీనియర్ నేత అరుణ్‌జైట్లీ ఆరోపించారు. ఇటీవల నరేంద్రమోడీని లక్ష్యంగా చేసుకుని కట్జూ వ్రాసిన వ్యాసంపై జైట్లీ మండిపడ్డారు.
- తన మరణంపై చింతించవద్దని పార్లమెంటుపై దాడి కేసులో ఉరిశిక్ష వేయబడ్డ అఫ్జల్‌గురు పేర్కొంటూ తన కుటుంబసభ్యులకు చివరి లేఖ వ్రాసారు. ఈ నెల 9వ తేదీన ఆయన ఈ లేఖ వ్రాసారు.
- నలుగురు వీరప్పన్ అనుచరుల ఉరిపై సుప్రీంకోర్టు స్టే విధించింది. 1993లో కర్ణాటకలో మందుపాతర పేల్చి 22మంది పోలీసులను హతమార్చిన కేసులో వీరప్పన్ అనుచరులు నలుగురికి సుప్రీంకోర్టు మరణశిక్ష విధించింది. వారి క్షమాభిక్ష పిటిషన్‌ను ఇటీవలే రాష్ట్రపతి తిరస్కరించారు. దీంతో ఉరిశిక్ష ఖాయమనుకుంటున్న తరుణంలో నిందితుల తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టులో అత్యవసర పిటిషన్ వేసి స్టే తెచ్చారు.
- తమ దేశంలో పెట్టుబడులు పెట్టాలని వచ్చే భారత వ్యాపారవేత్తలకు ఒక్కరోజులోనే వీసా మంజూరు చేస్తామని బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరూన్ ప్రకటించారు. తన మూడురోజుల భారత పర్యటనలో భాగంగా ఆయన సోమవారం ముంబైలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# వార్త వ్యాఖ్య

వార్త :- ఎర్రకోట నుంచి ప్రసంగిస్తా! - మాయావతి.
వ్యాఖ్య :- *ప్రధాని కావాలనేగా మీ కోరిక.*

వార్త :- ప్రజల కోర్కెలు తీర్చడమే టీడీపీ లక్ష్యం. - యనమల.
వ్యాఖ్య :- *అంతగా కమిట్ కాకండి... మీ ఆస్తులు అమ్మినా తీర్చలేరు.*

వార్త :- టీడీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. - అంబటి రాంబాబు.
వ్యాఖ్య :- *మరి వాళ్లు ప్రభుత్వహోదాపై కలలు కంటున్నారే!*

వార్త :- తెలంగాణపై అధ్యయనానికి మూడు నెలలు కావాలి. - రాహుల్.
వ్యాఖ్య :- *మూడునెలలు కాకపోతే ముప్పైనెలలు తీసుకోండి.*

వార్త :- త్వరలో రాష్ట్రానికి రాహుల్. - పీసీసీ చీఫ్ బొత్స.
వ్యాఖ్య :- *మన రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ఎత్తుబడిపోతుందన్నమాట!*

వార్త :- స్థానిక ఎన్నికల్లోనూ మేమే గెలుస్తాం. - మంత్రి ప్రసాద్‌కుమార్.
వ్యాఖ్య :- *సహకార ఎన్నికలలో మాదిరిగా అక్కడా ఓట్లను చేర్పించుకుంటామనే ధీమానా?*

వార్త :- తెలంగాణ రాదు... రాష్ట్రం విడిపోదు. - ఎంపీ రాయపాటి.
వ్యాఖ్య :- *సోనియాగాంధీ మీకేదో గ్యారంటీ పత్రం రాసిచ్చినట్లుందే!*

వార్త :- బాబు యాత్రను ఎన్నికలయాత్రగా చూడొద్దు. - ఈసీకి 'దేశం' నేతల విజ్ఞప్తి.
వ్యాఖ్య :- *అధికారం కోసం పడుతున్న అవస్థలుగా చూడమంటారా?*

వార్త :- రౌడీల తాటతీయండి. - డీజీపీ
వ్యాఖ్య :- *అలా తీసేటట్లుంటే ఇలా ఎందుకు రెచ్చిపోతారు.*

వార్త :- పార్టీ పరంగా పంచాయితీ ఎన్నికలు. - వి. హెచ్.
వ్యాఖ్య :- *కాంగ్రెస్ మీద కక్షకట్టినట్లున్నారే!*

వార్త :- గ్యాస్ ఇవ్వలేం! - రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి.
వ్యాఖ్య :- *ఈసారి ఎన్నికలలో మా రాష్ట్రం కూడా మొండిచేయే చూపిస్తుందిలే!*

# మొగ్గితగ్గిన ఢిల్లీ

(మొదటిపేజీ తరువాయి)

కాని తెలంగాణ ప్రకటన ఈరోజో, రేపో వెలువడాల్సిన తరుణంలో అనూహ్యంగా ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. దీనికి కారణం ఎవరు? సమాధానం కేసీఆర్! ఆంధ్రరాష్ట్ర ప్రయోజనాల కోసం కాదు, తన స్వప్రయోజనాల కోసమే కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్ర విభజనకు తెగబడింది.

రాష్ట్రంలో ఇప్పుడున్న రాజకీయ వాతావరణంలో ఎన్నికలు అంటూ జరిగితే కాంగ్రెస్ సమూలంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయం. 2004, 2009 ఎన్నికలలో కాంగ్రెస్‌కు అత్యధిక సీట్లను అందించింది మన రాష్ట్రమే. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో ఈ రాష్ట్రం నుండి కనీస లోక్‌సభ సీట్లు కూడా లేకుంటే కాంగ్రెస్‌కు ఒక మాదిరి స్కోర్ కూడా రాదు. కాబట్టి రాష్ట్రం మొత్తం మీద పోవడం కంటే ఏదో ఒక ప్రాంతంలో నిలబడడం మేలనుకుంది. ఈ నేపథ్యంలోనే టీఆర్‌ఎస్‌ను విలీనం చేస్తే తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తామని కాంగ్రెస్ అధిష్టానం ఆఫరిచ్చింది. వాస్తవంగా అంతకుముందే తెలంగాణ ఇస్తామంటే ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడానికి వెనుకాడబోమంటూ కేసీఆర్ ప్రకటించి వున్నాడు. దీనిని కాంగ్రెస్ అధిష్టానం వాడుకుంది. తెలంగాణను ఏర్పాటు చేసాక టీఆర్‌ఎస్‌ను విలీనం చేసుకుంటే ఆ ప్రాంతంలోనన్నా మెజార్టీ లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు వస్తాయన్నది కాంగ్రెస్‌పెద్దల ఆశ. ఈ దిశగానే కేసీఆర్‌తో బేరం కుదుర్చుకుని తెలంగాణపై సత్వరనిర్ణయం తీసుకునేలా చర్యలు ప్రారంభించారు.

అయితే తెలంగాణ వస్తుందనే వాతావరణం వచ్చేసరికి కేసీఆర్‌లో ఆందోళన రేగింది. కేసీఆర్‌కు వాస్తవంగా కావాల్సింది తెలంగాణ కాదు. తెలంగాణ సమస్య అలా మండుతూ వుండడమే. కాంగ్రెస్ అధిష్టానం అంత తొందరగా దిగొస్తుందని ఆయన వూహించలేదు కూడా! అంతేకాదు ఒకవేళ కాంగ్రెస్‌లో టీఆర్‌ఎస్‌ను ఆయన విలీనం చేయాలనుకున్నా అది కుదిరేపని కాదు. కాంగ్రెస్‌లోకి కేసీఆర్, ఆయన నమ్మినబంట్లు వెళ్లాల్సిందే! హరీష్‌రావు, ఇంకొందరు నాయకులు టీఆర్‌ఎస్‌ను అలాగే నడపడానికి సిద్ధంగా వున్నారు. తెలంగాణ వచ్చినా, టీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసినా ఇక తనకు రాజకీయ మనుగడ వుండదని కేసీఆర్ గ్రహించాడు. అందుకే కాంగ్రెస్‌లో టీఆర్‌ఎస్‌ను విలీనం చేసేది లేదని అధిష్టానానికి ఖరాఖండీగా చెప్పేసాడు. ఏ ప్రయోజనం అయితే ఆశించి కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ ఇవ్వడానికి సిద్ధపడిందో, ఆ ప్రయోజనం నెరవేరకపోయే అవకాశాలు కనిపించడంతో ఒక్కసారిగా వెనక్కితగ్గింది. మొదట తెలంగాణ ఒక నెలలో తేల్చేస్తామన్నవాళ్లు తర్వాత నెలంటే 30రోజులే కాదని పదిరోజులు అటూఇటూ వుండొచ్చన్నారు. ఇప్పుడు రాహుల్‌బాబు తెలంగాణ అధ్యయనానికే 3నెలలు పడుతుందన్నారు. 30రోజులు పోయి 3నెలలు అయ్యింది. 3నెలలు పోయి మూడేళ్లు, ఇది కూడా పోయి ముప్పైయేళ్లు అయినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు.

# క్రైమ్ కిల్లర్స్

(3వ పేజీ తరువాయి)

సులభంగా చంపవచ్చో ఆ సినిమాలో చూపించారు. హరనాథపురంలో జరిగిన దారుణాన్ని పరిశీలిస్తే ఆ సినిమా ప్రభావం నిందితుడి మీద ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. సినిమాలలో హింసాత్మక సన్నివేశాలు ఎక్కువగా వుంటున్నాయి. లోకం తెలియని పసిపిల్లలు సైతం ఎక్కువగా ఆకర్షితులయ్యేది ఫైటింగ్‌సీన్‌లకే!

ఇక టీవీలలో సీరియల్స్‌ను నిషేధిస్తే, న్యూస్ ఛానెల్స్‌లో క్రైమ్ స్టోరీలను నిలిపివేస్తే కొంచెం మార్పు రావచ్చు. ఏ సీరియల్ చూసినా క్రైమ్ సన్నివేశాలే! ఆడవాళ్ల చేతుల్లో కూడా గన్‌లు, కత్తులు... సీరియల్ అంతా మర్డర్ ప్లాన్‌లు. హింసను ప్రేరేపించే విధంగా సీరియళ్ళు, క్రైం స్టోరీలు వుంటున్నాయి. మన చట్టాల పట్ల భయం, భక్తి లేక పోవడం, ఎన్నినేరాలు చేసినా తప్పించుకోవచ్చుననే ధీమా, కష్టపడకుండానే కోట్లకు పడగలెత్తాలనే అత్యాశ యువతను తప్పుదారి పట్టిస్తున్నాయి. తప్పులు చేయిస్తున్నాయి. జీవితాన్ని అందంగా, అద్భుతంగా మలచుకోవాల్సిన వయసులో జైలు ఊచలు లెక్కపెడుతున్నారు. యువతా... ఇకనైనా మేలుకో... నీ జీవిత గమ్యాన్ని మలుచుకో...!


# నిర్వేదంలో టిడిపి

(3వ పేజీ తరువాయి)

నియోజకవర్గంలో రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి కూడా 'జనదీవెన' పేరుతో ప్రజల్లోకి పోతున్నాడు. ప్రధానప్రతిపక్షం తెలుగుదేశంలో మాత్రం ఇంకా గందరగోళ వాతావరణమే నెలకొనివుంది. జిల్లా అధ్యక్షుడిగా బీద రవిచంద్ర సమర్థవంతంగానే పని చేస్తున్నారు. అయితే నియోజకవర్గాల బాధ్యతలను పూర్తిగా అప్పగించకపోవడంతో ఎవరు ఎక్కడ పనిచేయాలి, పార్టీ కార్యక్రమాలను ఎవరు నిర్వహించాలన్నది ప్రశ్నగా మారుతుంది. ముఖ్యంగా నెల్లూరురూరల్, నగరం, ఆత్మకూరు నియోజకవర్గాలలో పూర్తి స్థాయిలో పార్టీ సేవకు అంకితమయ్యే నాయకులు లేక పార్టీ కేడర్ నిరాశలో వుంది.

# హోరాహోరీగా... హ్యాండ్‌బాల్ పోటీలు

నెల్లూరు నగరంలోని వి.ఆర్.కళాశాల మైదానంలో రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 41వ సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్-2013 పోటీలు ఆదివారం నుండి హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. ప్రారంభవేడుకల్లో ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, వియస్‌యూ వైస్‌ఛాన్సలర్ రాజారామిరెడ్డి, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్, శ్యాప్ వైస్‌ఛైర్మెన్ టిఆర్‌కె రావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వి.మోహన్‌రెడ్డి, జేసీ లక్ష్మీకాంతం, నగర పాలకసంస్థ కమీషనర్ టియస్‌ఆర్ ఆంజనేయులు, ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీఓ మాధవీలత తదితరులు పాల్గొన్నారు. ప్రతిరోజూ ఈ పోటీలు ఉత్కంఠత కలిగించే రీతిలో సాగాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణుల రాకతో నెల్లూరు నగరం ఎంతో సందడిగా కనిపించింది. పోటీల్లో ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌ఘడ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, పంజాబ్, జార్ఖండ్, జమ్ముకాశ్మీర్, అస్సాం, చంఢీఘర్, బీహార్ తదితర రాష్ట్రాల క్రీడాకారిణులు తమ జట్ల తరపున ఆడారు. గురువారం సాయంత్రం సెమీఫైనల్స్ జరిగాయి. శుక్రవారం జరిగే ఫైనల్స్‌తో ఈ పోటీలు ముగియనున్నాయి. నెల్లూరులో జాతీయస్థాయి క్రీడాపోటీలు ఎప్పుడు జరిగినా నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ముద్ర ఆ క్రీడలపై స్పష్టంగా కనిపించేది. క్రీడల ఆరంభం నుండి ముగింపు వరకు అన్నీ ఆయనే దగ్గరుండి చూసుకునేవాడు. అర్ధరాత్రిళ్లు సైతం మేలుకుని క్రీడాకారులకు కాపలాగా వుండేవాడు. నెల్లూరులో ఆయన లేని లోటు ఈ జాతీయక్రీడల్లో స్పష్టంగా కనిపించింది.

# నెల్లూరు కబుర్లు

## షార్‌కు రాష్ట్రపతి



భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ఈ నెల 25వ తేదీన శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్)ను సందర్శించనున్నారు. ఆరోజు జరిగే పీఎస్ఎల్‌వి-సి20 ప్రయోగాన్ని ఆయన వీక్షించనున్నారు. రాష్ట్రపతి హోదాలో ప్రణబ్ ముఖర్జీ షార్‌కు వస్తుండడం ఇదే మొదటిసారి. రాష్ట్రపతితో పాటు రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కూడా షార్‌కు రానున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తుంది.



ఈ నెల 20వ తేదీ నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీచేసిన రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, చాట్ల నరసింహారావు, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, మేకల నరేంద్ర, ఆర్డీఓ మాధవీలత తదితరులు.

## నెల్లూరు మార్కెట్లోకి చవర్లెట్ సెయిల్



కార్‌ను ఆవిష్కరిస్తున్న రంగమయూర్‌రెడ్డి

చవర్లెట్ కంపెనీకి చెందిన సెయిల్ కారు 15వ తేదీ నెల్లూరు మార్కెట్‌లోకి విడుదలైంది. నగరంలోని అయ్యప్పగుడి ప్రాంతంలో ఎంజీ బ్రదర్స్ షోరూం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సెయిల్‌తో పాటు వివిధ మోడల్స్‌లోని ఏడు రంగులలో లభించే కార్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. తొలుత ఎంజీ బ్రదర్స్ షోరూంను, చవర్లెట్ సెయిల్ కారును ఆనం రంగమయూర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎంజీ బ్రదర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.జి.గోపాలకృష్ణ మాట్లాడుతూ నెల్లూరు, తిరుపతి, చిత్తూరులలో చవర్లెట్ అధీకృత పంపిణీదారులుగా తాము వ్యవహరిస్తున్నామన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన సెయిల్ కారు రూ.5.08లక్షలకు అందుబాటులో ఉందన్నారు. డీజిల్ ఇంజిన్‌తో లభ్యమయ్యే కారు లీటరుకు 22.1కి.మీ మైలేజీ ఇస్తుందన్నారు. ఇప్పటికే 30కార్లు బుక్ అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆనం రంగమయూర్‌రెడ్డి, ఎం.జి.రాఘవేంద్ర, ఎంజీ బ్రదర్స్ సంస్థ జనరల్ మేనేజర్ శంభుప్రసాద్, ఏజిఎం రాజశేఖర్, మేనేజర్ యం.సుందరం తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా పోటీలకు నెల్లూరు చిన్నారి



నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌కు చెందిన వై.జ్యోత్స్నవి అంతర్జాతీయ యోగా పోటీలకు ఎంపికైనట్లు యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ అగర్వాల్ తెలిపారు. జ్యోత్స్నవి ఈ నెల 15న పంజాబ్‌లోని హోసియాపూర్‌లో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీలలో ప్రతిభచూపి 6వ స్థానం సాధించింది. ఈ ప్రతిభతో అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయి యోగా పోటీలలో ప్రతిభచూపిన జ్యోత్స్నవిని పలువురు అభినందించారు.

## సూర్య నమస్కారంతో... బుద్ధి వికాసం



సూర్య నమస్కారాలు నిత్యం చేయడంవల్ల ప్రతి ఒక్కరిలో శారీరక, మానసిక, బుద్ధి వికాసాలు చేకూరుతాయని యోగాశిక్షక్ ముప్పిరాల లక్ష్మీనరశింహశాస్త్రి తెలిపారు. నగరంలోని భక్తవత్సలనగర్ జి.వి.ఆర్.ఆర్ జూనియర్ కళాశాల ఆవరణంలో సోమవారం స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవసమితి ఆధ్వర్యంలో ఒకేసారి విద్యార్థులు సామూహిక సూర్యనమస్కారాలు నిర్వహించారు. అధికసంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు "ఓం మిత్రాయనమ" అనే మంత్రం జపించి సూర్యనమస్కారాలు చేశారు.

ఈ కార్యక్రమంలో సాయికుమార్‌రెడ్డి, జి.సుధాకర్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని మూడు ప్రాంతాల్లో వెయ్యిమందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు సూర్యనమస్కారాలు, యోగాసనాలు నిర్వహించారు.

## 'ఆధార్' నిందితుడి అరెస్ట్

తన ఇంట్లో భారీఎత్తున ఆధార్ కార్డులను నిల్వవుంచి, కార్డుదారుల నుండి నగదు వసూలుచేస్తున్న కేసులో మాజీ కార్పొరేటర్ వేల్పుల రజనీ భర్త వేల్పుల సాగర్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం నెల్లూరులోని 5వ నగర పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగర్ తన ఇంట్లో ఆధార్‌కార్డులను వుంచుకొని కార్డుదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారనే సమాచారం రావడంతో ఈ నెల 14వ తేదీన ఉమ్మారెడ్డిగుంటలోని ఆయన ఇంటిమీద సి.ఐ రాజశేఖర్‌రెడ్డి దాడిచేసారు. ఈ దాడిలో 169ఆధార్‌కార్డులను స్వాధీనం చేసుకోవడం జరిగింది. తపాలాశాఖ ద్వారా ప్రజలకు అందాల్సిన ఆధార్‌కార్డులు వేల్పుల సాగర్ ఇంట్లో వుండడంతో వారిపై కేసు నమోదు చేసాం. రజని, ఆమె భర్త సాగర్‌లు పోస్ట్‌మెన్‌ను ప్రలోభపెట్టి వారికి కొంత మొత్తం ఇస్తూ ఆధార్‌కార్డులను తమ ఇంట్లో వుంచుకున్నారు. ఈ కేసులో ప్రమేయమున్న వేల్పుల సాగర్, తపాలా శాఖ ఉద్యోగిని వెంకట నాగలక్ష్మి, ప్రమీల, షేక్‌నన్నేలపై 409, 420, 211, రెడ్‌విత్, 109 ఐపిసి సెక్షన్ల క్రింద కేసులు నమోదుచేసి అరెస్ట్ చేసామని, వేల్పుల రజనీ పరారీలో వుందని డిఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సి.ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, బాబూరావులు పాల్గొన్నారు.

## నెల్లూరు రైల్వేకోర్టుకు తిరుపతి ఎమ్మెల్యే, మాజీఎమ్మెల్యే

2010 జనవరిలో జరిగిన సమైఖ్యాంధ్ర ఉద్యమంలో భాగంగా తిరుపతిలో జరిగిన రైల్‌రోకో కేసులో తిరుపతి ఎమ్మెల్యే బి.కరుణాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ఎం.వెంకటరమణలు 19వ తేదీ నెల్లూరులోని రైల్వేకోర్టుకు హాజరయ్యారు. తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి జి.నరసింహయాదవ్, తెలుగు మహిళానాయకురాలు ఎన్.విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు సైకం జయచంద్రారెడ్డిలు కూడా ఈ కేసులో కోర్టుకు రావడం జరిగింది. వాదనల అనంతరం కోర్టు ప్రత్యేక న్యాయాధికారి పద్మిని మార్చి 8వ తేదీకి వాయిదా వేసారు.

## తహశీల్దార్ కార్యాలయంలో జేసీ



కంప్యూటర్‌లో డేటాను పరిశీలిస్తున్న లక్ష్మీకాంతం

నెల్లూరు తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం 19వ తేదీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన నేరుగా కార్యాలయంలోని మీ సేవా కేంద్రం వద్దకు వెళ్లారు. అక్కడ సిబ్బంది పనితీరును పరిశీలించారు. మీసేవా కేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీసారు. తమ కార్యాలయంలో ఒక కంప్యూటర్ ఆపరేటర్ అవసరం వుందనే విషయాన్ని ఇన్‌ఛార్జి తహశీల్దార్ జనార్ధన్‌రావు జేసీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి పలు విషయాలపై తహశీల్దార్‌తో ఇతర అధికారులతో చర్చించారు.

## బయోమెట్రిక్ పద్ధతిలో యూనిక్ ఐడి కార్డులు



యూనిక్ ఐడికార్డులను బయోమెట్రిక్ పద్ధతి ద్వారా జారీచేయడానికి వార్డుల వారీగా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను విభజించి అధికారులను నియమించారని నెల్లూరు నగర పాలక సంస్థ కమీషనర్ టిఎస్సార్ ఆంజనేయులు తెలిపారు. ఈనెల 18న కార్పొరేషన్ సమావేశ మందిరంలో కార్పొరేషన్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆర్.రాజేంద్రప్రసాద్, జంషీద్‌అహ్మద్, పిఆర్‌పి, పి.ఓలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ జనాభా రిజిస్టార్-2010లో నమోదు కాబడిన వారికి ఈ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 23లోగా సంబంధిత ఏర్పాట్లు పూర్తిచేసి సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించాలని కమ్యూనిటీ ఆర్గనైజర్లను ఆదేశించారు. మార్చి 1 నుంచి బయోమెట్రిక్ పద్ధతిలో నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు.

## తెలుగు అనువాదకునిగా కిరణశ్రీ



నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల స్ఫూర్తితో ప్రభుత్వ పాలనా వ్యవహారాలన్నీ మాతృభాష తెలుగులో జరపాలన్న ప్రభుత్వ నిర్ణయాన్నీ అమలు పరిచే దిశలో హైదరాబాద్ తెలుగు అకాడమీలో తెలుగు అనువాదకునిగా విద్వాన్ బి.కిరణశ్రీని ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ పాఠ్య గ్రంథ రచయితగా, వివిధ శాఖలలో గతంలో అనువాదకునిగా పనిచేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నియామకం జరిగింది.

## మాకు వదలండి... అంతుచూస్తాం

ఇటీవల మానవ మృగాల చేతిలో బలైపోయిన శకుంతల, భార్గవి హంతకులను కఠినంగా శిక్షించాలని, పోలీసులకు చేతకాకుండా తమకు వదిలేసినా వారి అంతు చూస్తామని నెల్లూరులో హిజ్రాలు నినదించారు. నెల్లూరు హరనాథపురంలో జరిగిన శకుంతల, భార్గవిల హత్యాకాండకు నిరసనగా చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం హిజ్రాలు గాంధీబొమ్మ కూడలిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నోటికి నల్లగుడ్డలు కట్టుకుని కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అభంశుభం తెలియని తల్లీకూతుర్లను చంపిన వారిని ఎన్‌కౌంటర్ చేయాలంటూ వారు నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో హిజ్రాల నాయకురాలు ఆర్.అలేఖ్య, చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్ట్‌మేనేజర్ చిరంజీవి, షీలా, చిట్టి, కావ్య, వైష్ణవి, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version





నెల్లూరురూరల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో వున్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18వ తేదీన నెల్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్దకు ప్రదర్శనగా వెళుతున్న వైయస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ నాయకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, మందా బాబ్జీ తదితరులు.

## కాపాడాల్సిన వాడే...

# కడతేర్చాడు!



- అనూహ్యంగా మలుపుతిరిగిన సోమలరేగడ హత్యకేసు
- ఇంటి యజమానే నిందితుడు
- భార్యను, తండ్రిని బిడ్డలను హతమార్చింది అతడే
- అప్పులు తీర్చలేకే దారుణం



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రమణకుమార్

జిల్లాను గడగడలాడించిన సోమలరేగడ హత్యలకేసు కంచే...చేను మేసిన చందంగా ఊహించని మలుపులు తిరిగింది. గాఢనిద్రలో ఉన్న కుటుంబసభ్యులను ఇంటి యజమాని బొందల రాధాకృష్ణారెడ్డే హతమార్చాడని ఎస్పీ రమణ కుమార్ తెలిపారు. ఆదివారం విలేకర్లకు ఈ హత్యలకు గల కారణాలను గురించి ఎస్పీ వివరించారు. దుత్తలూరు మండలం సోమలరేగడలో బొందల రాధాకృష్ణారెడ్డి(35) కుటుంబం నివసిస్తోంది. రాధాకృష్ణారెడ్డికి భార్య రమాదేవి(28) కుమార్తె ఝాన్సీ(12) కుమారుడు సోమశేఖర్‌రెడ్డి(10) తండ్రి వెంకటసుబ్బారెడ్డి(72) ఉన్నారు. వీరంతా ఊరు చివరన పొలంలో ఇల్లు కట్టుకొని జీవిస్తున్నారు. ఇతనికి ఆరు ఎకరాల పొలం వుంది. ఇటీవల తన కుటుంబ అవసరాల కోసం 7లక్షలు వరకు అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడేవాడు. ఉన్న పొలాన్ని అమ్ముకుంటే భార్యాబిడ్డలు వీధిన పడాల్సివస్తోందని, అలాంటి దుస్థితి తన కుటుంబసభ్యులకు రాకూడదంటే వారిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. తాను కూడా ఆత్మహత్య చేసుకోవాలనుకొన్నాడు. ఈ నెల 9వతేదీ రాత్రి మద్యం త్రాగి ఇంటికి చేరుకున్న రాధాకృష్ణారెడ్డి అదే రోజు రాత్రి 11గంటల సమయంలో విద్యుత్ మెయిన్ ఆపేశాడు. టార్చిలైటు వెలుతురులో ఇంటిలోని కొడవలి, కత్తిని పట్టుకుని తొలుత పశువుల పాకవద్ద నిద్రిస్తున్న తండ్రి వెంకటసుబ్బారెడ్డిని తీవ్రంగా గాయపరిచాడు. ఆ తర్వాత ఇంట్లోకి వెళ్ళి మంచంపై నిద్రిస్తున్న భార్య రమాదేవిని, కుమార్తె ఝాన్సీని, కుమారుడు సోమశేఖరరెడ్డిని కత్తులతో విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచాడు. తర్వాత తనకుతానే కత్తులతో శరీరాన్ని గాయపరచుకున్నాడు. ఆదివారం తెల్లారేసరికి విషయం గ్రామస్తులకు తెలియడంతో గాయపడ్డ వారిని గ్రామస్తులు ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో భార్య, కుమార్తె, కుమారుడు, తండ్రి మృతిచెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాధాకృష్ణారెడ్డి ఆదివారం ఉదయం ఆసుపత్రిలోని డ్యూటీ డాక్టర్‌కు తానే తన కుటుంబ సభ్యులను హతమార్చానని చెప్పడంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రాధాకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తే నిజం అంగీకరించాడని ఎస్పీ తెలిపారు. ఇందులో రాజకీయ కక్షలు, దాయాదుల కక్షలు లేవన్నారు. కావాలనే రాధాకృష్ణారెడ్డి తన బంధువులైన వెంకటేశ్వర్లురెడ్డి, పెద్దిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి పేర్లు ఒక కాగితం మీద రాసి పోలీసులను తప్పుదోవ పట్టించాడని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో ఉన్నా రాధాకృష్ణారెడ్డిని తాను పరామర్శించి అసలు ఏం జరిగిందని అడిగితే ఒక గంట సమయం ఇవ్వండని చెప్పాడని అప్పుడే అతనిపై తమకు అనుమానం కలిగిందన్నారు. రాధాకృష్ణారెడ్డికి వైద్యం చేసిన డాక్టర్లు అతని శరీరంపై ఉన్న గాయాలను చూసి అతనే స్వయంగా చేసుకున్న గాయాలుగా తేల్చడంతో తమ అనుమానం మరింతగా బలపడిందని ఎస్పీ తెలిపారు.

సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రశేఖర్, కావలి డిఎస్పీ ఇందిర, నెల్లూరురూరల్ డిఎస్పీ బాల వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచి సిఐ రాంబాబు, రూరల్ సిఐ జయరామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

**కొసమెరుపు:** జిల్లాలో గతంలో ఎన్నో సంచలన హత్యలు జరిగినా నిందితుడిని విచారించిన తీరును వీడియోల్లో బంధించని పోలీసు అధికారులు ఈ కేసులో మాత్రం ప్రత్యేకంగా వీడియోటేపుల్లో ఆ వివరాలను బంధించి విలేకర్లకు వెల్లడించడం విశేషం.

## పెద్దారెడ్డి ఫోటోనే లేదు



జిల్లా రాజకీయాల్లో నెల్లూరు పెద్దారెడ్డి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ప్రాభవం పూర్తిగా పడిపోయిందనడానికి డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్మెన్‌లుగా ఎన్నికైన వారు ఇచ్చిన పత్రికా ప్రకటనలే పెద్ద ఉదాహరణ. నిన్న మొన్న కాంగ్రెస్‌లో చేరిన నాయకుల ఫోటోలను సైతం ప్రకటనల్లో వేసుకున్నారు గాని, జిల్లా కాంగ్రెస్‌కు మొన్నటిదాకా పెద్దదిక్కుగా వున్న నేదురుమల్లి ఫోటో ప్రకటనల్లో గాని ఫ్లెక్సీలలో ఎక్కడా కనిపించకపోవడం ఆశ్చర్యకరం.

## డీసీసీబీ ఛైర్మెన్‌గా

# బాధ్యతలు స్వీకరించిన మెట్టుకూరు



ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా మెట్టుకూరు ధనుంజయరెడ్డి మంగళవారం నెల్లూరులోని బ్యాంకు కార్యాలయంలోగల తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అలాగే బ్యాంకు వైస్‌ఛైర్మెన్‌గా నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్‌లుగా డి.సుధీర్‌నాయుడు, వై.కృష్ణయ్య, డి.శ్రీనివాసులురెడ్డి, వై.శివరామకృష్ణారెడ్డి, యు.వెంకటసుబ్బారెడ్డి, వి.రమణారెడ్డి, కె.కమలాకర్‌రెడ్డి, సి హెచ్ వెంకటశేషారెడ్డి, కె.మోహన్‌రావు, కె.మాధవరెడ్డి, ఎ.విక్టోరియా, జి.ముత్యాలయ్య, సి.హెచ్.రమణమ్మ, ఎం.కృష్ణమూర్తి, టి.రమణయ్య, వి.శ్రీనివాసులు, బి.వెంకటేశ్వర్లు, జి.రమణయ్య, వై.సుబ్బయ్యలు ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా సహకార అధికారి సుబ్బారావు కొత్త పాలకవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, బ్యాంకు సిఇఓ. కె.వి.రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు చేవూరు దేవకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డీసీఎంఎస్ ఛైర్మెన్‌గా బాధ్యతలు తీసుకున్న సుమంత్



ప్రమాణస్వీకారం చేస్తున్న ఏదుగుండ్ల సుమంత్‌రెడ్డి

జిల్లా మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడుగా ఏదుగుండ్ల సుమంత్‌రెడ్డి 19వ తేదీ ప్రమాణస్వీకారం చేసారు. నెల్లూరు, శాంతినగర్‌లోగల సొసైటీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసులురెడ్డి, డైరక్టర్‌లుగా పి.వెంకురెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, కందల శ్రీధర్, ఆర్.సుప్రజ, పి.కృష్ణవేణి, జి.శ్రీనివాసులు ప్రమాణస్వీకారం చేసారు.

# షార్ డైరెక్టర్‌కు నాయుడమ్మ అవార్డ్



నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ ప్రతియేటా అందించే ప్రతిష్ఠాత్మక నాయుడమ్మ పురస్కారం 2013 సంవత్సరానికి షార్(శ్రీహరికోట) డైరెక్టర్ డా॥ ఎమ్.వై.ఎస్.ప్రసాద్‌ను ఎంపిక చేసినట్లు డైరెక్టర్ డా॥ ఎ.జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు.

మార్చి ఆఖరి వారంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నాయుడమ్మ 18వ స్మారకోపన్యాసం చేసి, అవార్డును డా॥ ప్రసాద్ అందుకుంటారు. ఈ అవార్డును పొందిన ప్రముఖులలో డా॥ కె.కస్తూరిరంగన్, డా॥ ఆర్.నటరాజన్, డా॥ ద్రోణంరాజు కృష్ణారావు, డా॥ పి.రామారావు, డా॥ పి.రామచంద్రరావు, డా॥ కిరిత్ పారిక్, డా॥ గోవర్ధన్ మెహతా, డా॥ వి.ఎస్.రామమూర్తి, డా॥ అనిల్ కకోడ్కర్, ఎస్.రామాదొరై, నందన్ నిలేకని, వి.రాజన్నతో పాటు అంతర్జాతీయంగా ప్రొఫెసర్ టి.నెజాత్ వెజిరోగ్లు(అమెరికా), ప్రొ॥ బెర్నాడ్ అమడై(అమెరికా), డా॥ గౌత్‌జాస్మన్ (మలేషియా) ఉండటం విశేషం.

*డా॥ ప్రసాద్ గురించి...*

డా॥ మలపాక యజ్ఞేశ్వర సత్యప్రసాద్ 1953లో మొగల్తూరు (పశ్చిమగోదావరి జిల్లా)లో జన్మించారు. కాకినాడ జెఎన్టీయులో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేశారు. బిట్స్‌పిలాని నుండి డాక్టరేట్ డిగ్రీ శాటిలైట్ కమ్యూనికేషన్స్‌లో పొందారు. గత 37సంవత్సరాలుగా ఇస్రోలోని పలు విభాగాలలో ప్రముఖ స్థానాలలో పనిచేశారు. 1994 నుండి 1998 వరకు ఫ్రాన్స్‌లోని భారత్ రాయబార కార్యాలయంలో ఇస్రో కౌన్సిలర్‌గా విధులు నిర్వర్తించారు. 1999 నుండి 2005 వరకు కర్ణాటకలోని హసన్‌లో మాస్టర్ కంట్రోల్ సెంటర్‌కు డైరెక్టర్‌గా, 2005 నుంచి 2008 వరకు అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. మరోవైపు 1995 నుంచి 2006వరకు ఐక్యరాజ్యసమితిలో ఇస్రో సభ్యునిగా ఉన్నారు. 2008 నుంచి షార్‌లో అసోసియేట్ డైరెక్టర్‌గా ఉన్నారు. చంద్రయాన్-1 ప్రయోగంలో కీలకపాత్ర వహించినవారిలో ప్రసాద్ ఒకరు.

సత్యంజీ గ్రూప్
సత్యంజీ
సింహపురి సిటీ
అందమైన గ్రీన్ పార్క్
వి.ఐ.ఆర్. స్కూల్ దగ్గర, ధనలక్ష్మీపురం, మెయిన్ రోడ్డు, ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు.
నెల్లూరు సిటీలో 36 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీలో
బ్యాంకులోన్ కస్టమర్స్‌కు
డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ 1100 Sft.
23,00,000/-
SPOT CASH
14,00,000/-
ప్రాజెక్ట్-1లో ఈ అవకాశం 10 మందికి మాత్రమే.
* Car Parking Extra
సర్వీస్ అపార్ట్‌మెంట్స్ 400 Sft.
ఫర్నిచర్‌తో కలిపి
10,00,000/-
*Car Parking Extra మాత్రమే.
33 అం॥ ప్లాట్స్ బై బ్యాక్ పద్ధతిలో
2 సం॥లకే
డబుల్ బెనిఫిట్
మొదటి 60 మందికి మాత్రమే.
మీ సమస్యలు పరిష్కారం కొరకు You Tube, R.R. S.Tv. Gem Channels చూడండి.
శుక్రవారం 7.30 P.M.
శనివారం 10.30 A.M.
7.30 P.M.
ఆదివారం 10.30 A.M.
బ్యాంకు లోన్ సౌకర్యం కలదు
9133 222 558
0861-2318286, 2341183
08622272555
www.satyamglanddevelopers.org
e-mail : jayasankar441@yahoo.com

PDF Compressor Free Version



## కదంబం

## మనుష్యులున్నారు జాగ్రత్త!

ఏనుగు నరసింహారెడ్డి,
హైదరాబాద్. 89788 69183.

మనుషులు
మహోన్నతులని విన్నది
పక్షిసంతతి
మానవుల దయాగుణం
తలపోసుకున్నది
జంతుజాలం
వాళ్ళ ఔదార్యం వల్లనే
మనుగడ కొనసాగుతుందని
నీరాజనాలు పట్టింది
క్రిమి సమూహం
వాళ్ళకున్న మహోన్నత
గుణం గురించి కథలుగా తెలుసుకున్నది
ప్రకృతి
దాన్ని మానవత్వం అంటారని
కళ్ళల్లో నీళ్ళు చూసి
కరిగిపోతారని
రాలిన చెట్ల ఆకుల్ని
జాలితో చేరదీస్తారని
ఆవరణం ఆరాటపడ్డది
వానకు వెలసిన సింగిడీని
తమకంగా చూసినట్లు
మనిషిని చూసింది ప్రకృతి
మంచినీటి సరస్సులో
ఈదులాడినట్లు
తదేకంగా పరిశీలించింది
జీవజాలం

మనిషి జీవలక్షణం
ఎప్పుడు ఎదురవుతుందా అని
అవి అదే పనిగా చూసాయి
మానవత్వం ఎలా
పరిఢవిల్లుతుందా అని
ఉత్కంఠతో
ఊగిపోయాయి

తడిసిన నిప్పుల మీద
జడివాన కురిసింది
శీతల పవనమ్మీద
వడగండ్లు నర్తించినై
జీవరాశికి మనిషితత్వం
సరికొత్తగా అర్థమయింది
అవి హతాశులై
హాహాకారాలు చేసినై
ఏ పశువుకూ లేని లక్షణం
మనిషి దగ్గర ఎప్పుడూ ఊహించలేదు
పంపకం చేయాల్సిన ఆహారం
అమ్ముకుంటున్నాడు
మేఘం జార్చిన జలాన్ని
లేబుళ్ళేసి మార్కెట్టు
చేసుకుంటున్నాడు
అది మానుషమయితే కావచ్చు కానీ
ఎంత దారుణమో చెప్పేందుకు
మాటలు రానందుకు
అవి మొదటిసారి దుఃఖించాయి
పశుత్వపు ఔన్నత్యాన్ని తలుచుకొని
పరవశించిపోయినై
ఇక ఈ దుర్మార్గులు
గాలిని కూడా
క్యూబులకింద అమ్ముకునే రోజు
ఎంతో దూరంలో లేదని
సైగలతో చెప్పుకున్నై
'మనుష్యులున్నారు జాగ్రత్త'.

## గల్పిక

# యుగాంతంపై వైకుంఠంలో చర్చ

శ్రీను

అది వైకుంఠంలో 'శేష' కాన్ఫరెన్స్ హాల్. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పాటు ఇంద్రుడు, యముడు, వరుణుడు, వాయుదేవుడు, అగ్ని వంటి దేవుళ్లందరూ ఆ సమావేశ మందిరంలో వున్నారు. విష్ణు, బ్రహ్మ, శివలు వేదికమీద ఏర్పాటు చేసిన సింహాసనాల మీద కూర్చుని వున్నారు. కొందరు సేవకులు సమావేశానికి వచ్చినవారికి థమ్సప్, కోకోకోలా, లిమ్కా వంటి పానీయాలను అందిస్తున్నారు. ఇంద్రుడు వుండి... త్రిమూర్తులారా... మమ్మల్ని అందరినీ ఇక్కడికి పిలిపించడానికి కారణమేమిటని ప్రశ్నించాడు. దానికి బ్రహ్మ... మాకు మాత్రం ఏం తెలుసు... నారదుడు గంటక్రితమే నా సెల్‌కు ఫోన్‌చేసి అర్జంట్‌గా మీటింగ్ అరేంజ్ చేయమన్నారు. అందుకే ఈ మీటింగ్ అని చెప్పాడు. అంతలో 'నారా... నారా' అంటూ నారదుడు వచ్చాడు. అది విని అందరూ ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకున్నారు. పరమేశ్వరుడు వుండి... అదేంటి నారదా, ఎప్పుడూ నారాయణ.. నారాయణ... అంటుండే వాడివి.. ఇప్పుడు 'నారా' అని కలవరిస్తున్నావు. నారా చంద్రబాబునాయుడు పాదయాత్రలో పాల్గొని కాని వస్తున్నావా... నువ్వు నారాయణ అనడానికి బదులు 'నారా' అనే సరికి చూడు... విష్ణుమూర్తి ఎంతగా బాధపడుతున్నాడో అని అడిగాడు. దానికి నారదుడు... అయ్యో, మహానుభావులారా... నన్ను అపార్థం చేసుకోకండి... నేను మొన్న భూలోకానికి వెళ్లాను. హైదరాబాద్‌లో అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(63)ని పరామర్శించడానికి వెళ్లాను. అక్కడ ఆయన వచ్చిన వారందరినీ సగం పేరుతోనే పిలుస్తున్నాడు. అక్కడ ఓ అరగంట వుండేసరికి నాకు కూడా ఆ అలవాటు వచ్చింది. అందుకే 'నారాయణ' అనే పేరును షార్ట్‌కట్‌లో పలుకుతున్నాను అని వివరించాడు.

అప్పుడు యముడు లేచి... ముందు ఈ ఉప్పర్‌మీటింగ్‌లు ఆపండి... యమలోకంలో పాపులు పదికిలోమీటర్ల పొడవున క్యూకట్టి వున్నారట... నేను అర్జంట్‌గా వెళ్లి వాళ్ల లెక్కలు క్లియర్ చేయాలి. అసలు మమ్మల్ని పిలిపించిందెందుకో చెప్పండి అని గర్జించాడు.

అప్పుడు నారదుడు... భూలోకంలో ఇప్పుడు 'యుగాంతం' ఎప్పుడూ అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. 2012కు కలియుగం అంతమవుతుందని మొన్నటిదాకా పుకార్లు పుట్టించారు. 2012 పోయి 2013 కూడా వచ్చింది. మాయన్ కాలెండర్ ప్రకారం భూమిపై జీవరాశి అంతరిస్తుందని కొందరు వాదిస్తున్నారు. బ్రహ్మంగారు చెప్పిన కాలజ్ఞానం కూడా ఉత్తిదే అని కొందరు పుస్తకాలు వ్రాస్తున్నారు. ఈ పరిస్థితుల వల్ల ప్రజలలో దేవుళ్లు లేరు... కలియుగం అంతం కాదు అనే అభిప్రాయం బలపడుతుంది. అసలు యుగాంతం వుందా? లేదా? అసలు యుగాంతాన్ని అడ్డుకుంటున్నదెవరు? ఈ విషయాలను మాకు మీరు స్పష్టం చేయాల్సివుంది. 'యుగాంతం' పేరు చెప్పి భూలోకంలో చాలామంది సినిమాలు తీసి ప్రజల బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు. యుగాంతం లేదని వారికి తెలిస్తే కనీసం ఆ పిచ్చి సినిమాలను చూడడమన్నా ఆపేస్తారని ఆవేశంగా చెప్పాడు.

నారదుడు చెప్పింది విని... త్రిమూర్తులు ముగ్గురూ నవ్వారు. విష్ణుమూర్తి వుండి... పిచ్చి నారదా... కలియుగం అంతం అనేది ఇప్పుడు మన చేతుల్లో లేదు. అదెప్పుడో మన చేతులు జారి భూలోకంలో వున్న రాజకీయనాయకుల చేతుల్లోకి వెళ్లిపోయింది అని చెప్పాడు. అదెలా స్వామీ అని నారదుడు ప్రశ్నించాడు. భూలోకంలో మరీ ముఖ్యంగా భారతదేశంలో వున్న రాజకీయ నాయకులు మంచి పనులు చేసినా, వారి నోటి నుండి నిజాలు వచ్చినా యుగాంతం ఖాయం అని అన్నాడు. నారదుడికి ఇంకా అర్థం కాక... అదెలాగో కాస్త వివరంగా చెప్పండి స్వామి అని అడిగాడు. అప్పుడు విష్ణుమూర్తి వెంటనే అక్కడే ఒక స్క్రీన్‌ను, ప్రొజెక్టర్‌ను ఏర్పాటు చేసాడు. ప్రొజెక్టర్ ఆన్ చేసాడు. స్క్రీన్ మీద దృశ్యాలు మొదలయ్యాయి. అది రష్యా రాజధాని మాస్కో నగరం. రాత్రివేళ ప్రజలంతా ఎవరి పనుల్లో వాళ్లున్నారు. అంతలోనే ఆకాశంలో పెద్ద విస్ఫోటనం... హిరోషిమాపై అమెరికా వేసిన అణుబాంబు కంటే ఎంతో శక్తివంతమైన గ్రహశకలం ఆకాశంలోనే పేలి పోయింది. ఆ శకలాల ముక్కలు పడి 1200మంది రష్యన్ పౌరులు గాయపడ్డారు.

స్క్రీన్ మీద ఆ సీన్ అంతటితో అయిపోయింది. అప్పుడు విష్ణుమూర్తి... ఈ ఉత్పాతం ఎందుకు జరిగిందనుకుంటున్నారు అని ప్రశ్నించాడు. దానికి నారదుడు, ఇది ఎగ్జామ్‌హాల్ కాదు స్వామి... ఆన్సర్ కూడా మీరే చెప్పండి అని కోరాడు. దానికి విష్ణుమూర్తి వుండి... ఎన్నో ఏళ్లుగా నానుస్తూ వచ్చిన భారత పార్లమెంట్ దాడి నిందితుడు అఫ్జల్ గురుకు భారత ప్రభుత్వం మరణశిక్షను అమలు చేసింది. దాని ప్రభావమే ఈ గ్రహశకలం పేలుడు. దీని ప్రభావం కొంచెం తక్కువగా వుంది కాబట్టి ఆదివారం నాడు ఓ భారీ గ్రహశకలం భూమికి 25వేల కిలోమీటర్ల దూరంలో నుండి పోయింది... ఒకవేళ ఢీకొట్టి వుంటే భూమి బద్దలయ్యేది అని చెప్పాడు.

అది విని నారదుడు... స్వామి ఒక్క నిర్ణయానికే ఇంత ఎఫెక్ట్ చూపిస్తే.. ఇక భూలోకంలో వున్న నాయకులంతా నిజాలు చెప్పేస్తే పరిస్థితి ఎలా వుంటుందని సందేహంగా అడిగాడు. దానికి విష్ణుమూర్తి... ఆ ప్రాక్టికల్ వూహాచిత్రం కూడా తయారుచేసాను... దేశంలో వున్న నాయకులందరూ ఒకేసారి నిజాలు చెబితే ఎలాంటి ఉత్పాతం సంభవిస్తుందో మీరే చూడండంటూ విష్ణుమూర్తి ప్రొజెక్టర్ ఆన్ చేసాడు.

అది ప్రధాని మన్మోహన్‌సింగ్ కార్యాలయం. అక్కడ విలేకరులున్నారు. మన్మోహన్‌సింగ్ వారితో... నా హయాంలో జరిగినన్ని కుంభకోణాలు ఇంకెప్పుడూ జరగలేదు. దీనికి నేను తీవ్రంగా చింతిస్తున్నాను. సోనియా చేతిలో నేను రబ్బరుబొమ్మను కాబట్టే ఈ కుంభకోణాలన్నింటికి మౌనసాక్షిగా మిగిలిపోయాను అని చెప్పాడు.

అది బీజేపీ అగ్రనేత అద్వానీ నివాసం. మీడియాతో ఆయన... ఎన్నికల వరకే మాకు రాముడు అవసరం. అధికారంలోకి వచ్చాక ఆయన అనవసరం అని చెప్పాడు.

రాహుల్‌గాంధీ ఓ యువజన సదస్సులో మాట్లాడుతూ అధికారం విషం లాంటిదని మొన్న చింతన్‌బైఠక్‌లో చెప్పాను. అధికారం విషం అయితే ఇన్ని దశాబ్దాల పాటు మా కుటుంబమే ఆ విషాన్ని ఎందుకు తాగేది. అధికారం అమృతంలాంటిది. ఆ అమృతం కోసమే మా పోరాటం అని చెప్పాడు.

బీఎస్పీ అధినేత మాయావతి ఓ సభలో మాట్లాడుతూ... ఈ దేశంలో దళితులకు కావాల్సిందొక్కటే.. నేను ప్రధానిని కావడం... వాళ్లకు కూడు, గూడు, గుడ్డ వంటివి అవసరం లేదంది.

ఆంధ్రా సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తన ఛాంబర్‌లో... రాష్ట్రంలో అమలు జరుగుతున్నవన్నీ వై.యస్. పథకాలే. మావి కాదు, ఇవి సోనియా గాంధీయో, రాహుల్‌గాంధీ పథకాలో కాదు. వై.యస్. దయవల్లే మా పార్టీ ఈరోజు అధికారంలో వుంది అని చెప్పాడు.

గుంటూరుజిల్లా పాదయాత్రలో వున్న చంద్రబాబు... నేను ప్రజల కోసం ఈ పాదయాత్ర చేస్తున్నానంటే మీరు సాంబార్‌లో కాలేసినట్లే. నేను నా కోసం, అధికారం కోసం 63ఏళ్ల వయసులో కూడా ఈ పాదయాత్ర చేస్తున్నాను అని చెప్పాడు.

అలాగే నల్గొండ జిల్లాలో పాదయాత్రలో వున్న షర్మిల... నేను ప్రజల కోసం పాదయాత్ర చేయడం లేదు. మా అన్న జగన్ జైలులో వున్నాడు కాబట్టి, ఆయన్ని ప్రజలు మరచిపోకుండా, మా కార్యకర్తలు పార్టీని వదిలిపోకుండా చూడడం కోసమే ఈ పాదయాత్ర చేస్తున్నాను అని చెప్పింది.

సీపీఎం నాయకులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ... మేం ఉద్యమాలు ప్రజల కోసం చేయడం లేదు. ప్రజలు ఇప్పటికే మమ్మల్ని మరచిపోయారు. అరకొర మిగిలివున్న వాళ్లు కూడా మరచిపోకూడదనే ఉద్యమాలు చేసుకుంటూ కాలాన్ని వెళ్లదీస్తున్నామని చెప్పాడు. వీళ్లంతా నిజాలు టకటకా చెప్పేసారు...

ఆ వెంటనే ప్రళయం... ఆకాశం నుండి వందలాది గ్రహశకలాలు వేల కిలోమీటర్ల వేగంతో వచ్చి భూమిని ధనాధనామని గుద్దుతున్నాయి. ఆ గుద్దుడుకు భూమి బద్దలుగా పగలసాగింది. భవనాలు కూలిపోసాగాయి. సముద్రాలు వచ్చి దేశాలకు దేశాలనే ముంచెత్తసాగాయి. ఆ ప్రళయానికి, ఆ విలయానికి భూమి మీద జీవరాశి అనేది లేకుండా పోయింది. అంతా అయిపోయాక చివరిగా స్క్రీన్ మీద "యుగాంతం సుఖాంతం" అనే అక్షరాలు పడ్డాయి. విష్ణుమూర్తి ప్రొజెక్టర్ ఆఫ్‌చేసి... చూసారా... యుగాంతం ఎవరి చేతుల్లో వుందో... ఇది కేవలం రాజకీయ నాయకుల ఫోటోలను తీసుకుని గ్రాఫిక్స్‌లో రూపొందించిన వూహాచిత్రమే. ఈ నాయకులంతా నిజాలు చెబితే జరగబోయేది కూడా ఇదే! వాళ్లు ఎలాగూ నిజాలు చెప్పేదీ లేదు, నిజాలు చెప్పే అలవాటూ లేదు. కాబట్టి యుగాంతం అనేదే వుండదు అని చెప్పాడు. 'యుగాంతం' అనే ప్రశ్నకు క్లారిటీ రావడంతో వచ్చిన వాళ్లంతా వారివారి యమహా, హీరోహోండా, పల్సర్, స్కూటీ బండ్లలో తిరుగుపయనమయ్యారు.


# భక్తుల మనోభావాలు దెబ్బతినే రచనలు రద్దుచేయాలి

భగవత్ స్వరూపుడు శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రపై భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా రాసిన రచనలను రద్దుచేయాలని, రచయితను కఠినంగా శిక్షించాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపులూరి హనుమంతరావు ఆదివారం డిమాండ్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన రచయిత మర్రి వెంకట నరసింహారెడ్డి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్రను వక్రీకరించి రాసారంటూ కొన్ని రోజులుగా విశ్వబ్రాహ్మణ సేవాసంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వీరబ్రహ్మేంద్రస్వామి వారి పోరాట సమితి ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నుంచి ప్రారంభమైన ప్రచార రథం ఆదివారం నెల్లూరుకు చేరుకుంది. హనుమంతరావు విలేకర్లతో మాట్లాడుతూ నరసింహారెడ్డి పిహెచ్‌డి చేయాలనే స్వార్థంతో శ్రీస్వామిపై అర్థంలేని విమర్శలు చేశారన్నారు. వాటిని పరిశీలించకుండా పొట్టిశ్రీరాములు విశ్వ విద్యాలయం వారు ప్రపంచ తెలుగు మహాసభల్లో ఈ పుస్తకాన్ని విడుదలచేశారని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలోని 70లక్షల మంది విశ్వబ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.

PDF Compressor Free Version



## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఉద్యోగులకు అధికారులతో పబ్లిక్‌తో ఇబ్బం దులుండి, పనిభారం ఎక్కువగా ఉంటుంది. ఖర్చులు అదనంగా ఉండినా డబ్బు సర్దుబాటు అవుతుంది. షేర్లు, స్థిరాస్తులపై ఆదాయముంటుంది. తండ్రివర్గ బంధు వులకనారోగ్య బాధలుంటాయి. వ్యాపారవృద్ధికి క్రొత్త ఆలోచనలు పథకాలు అమలుచేస్తారు. ఈ రాశి వారికి ఆదాయం గతంకన్నా పెరుగుతుంది.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర1, 2పాదాలు

గృహ మార్పులు, వస్తు వాహన గృహ రిపేర్లుం డగలవు. కండరాలు నరాల సంబంధమగు బాధలుం టాయి. శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు తప్పనిసరిగా ఉండటం జరుగుతుంది. ఉద్యోగ వ్యాపా రులకు అధికారుల బెడద ఉండవచ్చును. ఆదాయానికి తగ్గట్లు ఖర్చులు పైనబడతాయి. బిడ్డలతో విభేదాలను పరిష్కరించుకొంటారు.


## మిధునం



మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

పనులు జరుపుకొనే దానికై సామర్ధ్యంగా నడుచు కొనండి. పట్టుదలకుపోవద్దు. వ్యాపారవర్గాలకు ఆర్థి కంగా అవకాశాలు లభించి, ఆదాయం స్వల్పంగా పెరు గుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఆడం బరాలకు విలాసాలకు మొగమాటాలకు పోయి ఖర్చులు పెంచుకొంటారు. అవసరాలకు అప్పు, చేబదుళ్ళు చేయవ లసివచ్చు. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

స్థిరాస్తులు కొనుగోలు చేయాలనే ఆలోచనలు ఏర్పడ తాయి. అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చును. బిడ్డల విద్యా వివాహ విషయాలందు పేచీలు రావచ్చును. వృత్తి ఉద్యోగ వ్యాపారాలలో ఇబ్బందుల నుండి తేరుకొంటారు. వ్యాపారవర్గాలకు మంచి ఆర్థికావకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. వృత్తిపరంగా అవకాశాలు బాగుండి పరిచయాలు పెరుగుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

విలువైన వస్తువులు, డబ్బు విషయంలో ఏమరపాటు లేకుండా ఉండండి. రావలసిన బాకీలు కొంత వసూలు కావడం, బాడుగలు, వడ్డీలు పొందడం జరుగుతుంది. ఉద్యోగులకు అదనపు ఆదాయము, అధికారుల సహ కారం బాగుంటుంది. స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరు గుతాయి. వృత్తి వ్యాపారాలలో పురోభివృద్ధి సాధిస్తారు. ఆదాయం పెరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

మార్కెటింగ్ విభాగం వారు ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతాయుతంగా మెలగి అధికారులకు దగ్గరకాగలరు. ప్రభుత్వ అను మతులు, క్రొత్త కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు జరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. వృత్తి వ్యాపా రాలలో మంచి అవకాశాలు దొరకడం, ఆదాయం పెర గడం జరుగుతుంది. శుభకార్యాలలో పాల్గొంటారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 22.02.2013 నుండి
తేది. 28.02.2013 వరకు

ఈ వారం మేషంలో కేతువు, వృషభంలో గురువు, మిధున కర్కాటక సింహ కన్యలలో చంద్రుడు, తులలో శనిరాహువులు, కుంభంలో రవిబుధ కుజ శుక్రులు సంచరిస్తారు.

### పంచాంగము :

శుక్ర మౌఢ్యమి జరుగుచున్నది.

ముహూర్తములు లేవు.

తేది 25 సోమవారం మాఘపూర్ణిమ

### మాఘమాస శుక్లపక్షతిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | ద్వాదశి | రా॥ గం.11.46వ॥ |
| తేది. 23 | శని | త్రయోదశి | రా॥ గం.1.0వ॥ |
| తేది. 24 | ఆది | చతుర్దశి | రా॥ గం.1.53వ॥ |
| తేది. 25 | సోమ | పూర్ణిమ | రా॥ గం.2.20వ॥ |

### మాఘమాస కృష్ణపక్షతిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 26 | మంగళ | పాడ్యమి | రా॥ గం. 2.09వ॥ |
| తేది. 27 | బుధ | విదియ | రా॥ గం.1.34వ॥ |
| తేది. 28 | గురు | తదియ | రా॥ గం.12.26వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

దూరపు బంధువుల క్షేమ సమాచారాలు అందుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు, ప్రముఖులను కలు సుకొనడం, శుభకార్య ప్రయత్నాలు ఫలించడం జరుగు తుంది. అనుకున్న పనులు సక్రమంగా జరుగవు. ఆలస్యం కాగలవు. వృత్తి ఉద్యోగాలలో గౌరవప్రదమైన గుర్తింపుం టుంది. వ్యాపారవర్గములకు అభివృద్ధికై అవకాశాలు దొరుకుతాయి. విద్యాప్రగతి, ఆరోగ్యం బాగుంటుంది.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కుటుంబ విషయాలలో తగాదాలు రాకుండా సర్దు బాటు ధోరణిలో వ్యవహరించండి. ముఖ్యమైన ఆఫీసు పత్రాలు, సమాచారం లభించగలవు. వృత్తి వ్యాపారాలలో సరైన అవకాశాలు దొరకవు. ఆదాయం ఆశించిన విధంగా లభించదు. చేసే పనులు సరిగా జరుగక చికాకు, టెన్షన్ పడుతుంటారు. శుభకార్యాలలో పాల్గొనడం, పెట్టుబడులు షేర్లపై ఆదాయం తగ్గడం ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యాపారాలలో మంచి ఆర్థికావకాశాలు దొరుకు తాయి. స్థిరాస్తుల లావాదేవీలు నిర్వహించగలరు. కుటుం బంలో ఒకరికి అనారోగ్య బాధ ఉంటుంది. ఖర్చులు అదుపులో జాగ్రత్తలు తీసుకొంటారు. అనుకోని అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. వృత్తి యజమానులకు సామాన్య రాబడి ఉంటుంది. బిడ్డల విద్యావృద్ధి, వివాహాది శుభకార్యాలు నిర్ణయంకావడం, దూరప్రయాణాలుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

తల్లివర్గం వారికి అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగ సమస్యల నుండి బయటపడి ప్రమోషన్లు, అను మతులను ఉద్యోగులు పొందుతారు. ఆకస్మికముగా వస్తు ధనలాభాలుండగలవు. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పని పట్టుదలగా నెరవేర్చగలరు. స్థిరాస్తుల లావాదేవీలందు తొందరపాటు వద్దు. వివాహాది శుభ కార్యాలు ఖరారుకావడం జరుగుతుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపారవర్గాలకు అభివృద్ధి అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. వృత్తివర్గాలకు గుర్తింపు, అవకాశాలుంటాయి. షేర్లు లాభసాటిగా ఉంటాయి. బిడ్డల ఆరోగ్య విద్యా విషయాలలో శ్రద్ధ చూపుతారు. ఈ రాశి వారికి ఆదాయం బాగుంటుంది. స్థలాలు భూములు క్రయవిక్రయాలు జరిగే అవకాశాలున్నాయి. ఉద్యోగులు విధి నిర్వహణలో సమర్థత చూపుతారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యాపారవర్గాలకు అవకాశాలు చేజారిపోవచ్చును. షేర్ మార్కెట్ అసంతృప్తి కలిగిస్తుంది. ముఖ్య బంధు వర్గంలో అనారోగ్య బాధలుంటాయి. నూతన పెట్టు బడులు, పొదుపు పథకాలపై దృష్టిపెడతారు. అనుకున్న పనులు నిదానముగా జరుగుతాయి. ఆదాయము సంతృప్తికరంగా ఉంటుంది. అయితే ఏదో ఒక రూపంలో ఖర్చులు పెడుతూ వుంటారు.

# ఉపాధ్యాయులు ఆదర్శంగా వుండాలి...

## మంత్రి శైలజానాథ్

రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖామంత్రి శైలజానాథ్ ఈనెల 18న కావలి మండలం, గౌరవరంలో జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను, కప్పరాళ్ళ తిప్పలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఉన్నత పాఠశాలలో 6, 10వతరగతి విద్యార్థులను ప్రశ్నించి వారు ఇచ్చిన సమాధా నాలకు సంతృప్తిని వెలిబుచ్చారు. మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావుతో కలిసి తింటూ మెనూలోని కోడిగుడ్డును పెట్టకపోవడాన్ని గుర్తించి నిర్వాహకులను ప్రశ్నించారు. తిప్పలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులను కొన్ని పదాలు రాయమని కోరగా వారు సరిగా రాయకపోవడం, తప్పులు దొర్లడం పట్ల అసహనం వ్యక్తంచేసారు. అలాగే ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు టీషర్టు ధరించి వుండడాన్ని గమనించి సున్నితంగా మందలిస్తూ వస్త్రధారణ మార్చుకోమని, బోధన మెరుగుపరుచుకో మని సూచించారు. తనిఖీలో ఆయనతో పాటు ఆర్వీయం ప్రాజెక్ట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, ఏఎల్ఎఫ్ కో–ఆర్డినేటర్ జయరామనాయుడు, సియంఓ రవిప్రసాద్, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రమణారెడ్డి, డిప్యూటీ డి.ఇ.ఓ మేరీ ఆరతి, ఎంపిడిఓ టి.వసుంధర, ఎం.ఇ.ఓ టి.సత్యనారాయణలు పాల్గొన్నారు.

# యోగా ఉచిత శిక్షణా తరగతులు


నెల్లూరు పట్టణంలోని ఆరు ప్రదేశాలలో, కోవూరులో ఈనెల 18నుండి రోటరీక్లబ్ నెల్లూరు సౌత్ ఆధ్వర్యంలో సిద్ధసమాధియోగ(ఎస్ఎస్‌వై) శిక్షణాతరగతులు నిర్వహించ బడతాయని రోటరీ అధ్యక్షులు యం.వెంకటాద్రిరెడ్డి, కార్యదర్శి సిహెచ్ నరసింహారావులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6గం॥ నుండి 8గం॥ల వరకు వారం రోజుల పాటు పలుకేంద్రాలలో ఏడు వారాలు శిక్షణా తరగతులు జరుగుతాయని తెలిపారు. ఆరోగ్యకరమైన, ఆనందమయ జీవితాన్ని అనుభవిస్తూ సుఖజీవనయానం చేయడం ఎలా, అందరితో సత్సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకొని స్నేహపాత్రంగా వుండడం ఎలా అని అందరికీ తెలియజేయడమే ఈ శిక్షణా శిబిరం ముఖ్య ఉద్దేశ్యంగా ఎస్ఎస్‌వై నెల్లూరుజిల్లా కో–ఆర్డినేటర్, రోటేరియన్ వామ్మిన సతీష్, రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ నేతాజీ సుబ్బారెడ్డి, సిద్ధసమాధియోగ ఆచార్యులు శ్రీనివాస్‌జీలు పేర్కొన్నారు.

కోవూరులోని వాసవి కన్యకాపరమేశ్వరిగుడిలో ఈనెల 18న, నెల్లూరులోని ఆర్టీసి బస్టాండ్ దగ్గరగల రోటరీ ఆడిటోరియంలో 19న, స్టోన్‌హౌస్‌పేటలోని కామిశెట్టి వారిసత్రంలో 20న, ఇస్కాన్ టెంపుల్‌లో 21న, వేదాయపాళెంలోని ఎంవిఎస్ కల్యాణమండపంలో 22న, పొదలకూరురోడ్డులోని సాయిబాబా మందిరంలో 23న, చిల్డ్రన్స్ పార్కు దగ్గర ఆదిత్య డిగ్రీ కళాశాలలో 24న శిక్షణాతరగతులు ప్రారంభమ వుతాయని వారు తెలిపారు.

### తహశీల్దార్‌పై

# చర్యలు తీసుకోవాలి

తడ తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందిని, విఆర్ ఓలను వేధిస్తున్న తహశీల్దార్ మునిలక్ష్మిపై చర్యలు తీసుకో వాలని విఆర్‌ఓల సంఘం రాష్ట్ర ఆంధ్రప్రాంత అధ్యక్షుడు పంటా అశోక్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేసారు. మంగళ వారం నెల్లూరు కలెక్టరేట్‌లోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మునిలక్ష్మి ఎక్కడ పనిచేసినా సిబ్బందిని వేధించడం ఒక దినచర్యగా పెట్టుకుందన్నారు. ఓజిలి డిటీగా పనిచేసిన సమయంలో ఆమె డెత్ రిజిష్టర్లను ట్యాంపరింగ్ చేసి సస్పెండ్ కూడా అయ్యింది. కారుణ్య నియామకంలో తప్పుడు సమాచారమిచ్చి ఆమె ప్రభుత్వాన్ని మోసం చేసారు. మునిలక్ష్మిపై సమగ్ర విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఈ నెల 24న ఎన్‌జిఓ హోంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామని హెచ్చరించారు.


1. 1981 సెప్టెంబర్ 24 జననం. ఎత్తు 5'10". చదువు యం.బి.బి.యస్(కర్నూలు). పిజి మాస్టర్స్ ఇన్ పబ్లిక్ హెల్త్ (న్యూ మెక్సికో) అమెరికా రెసిడెన్సి మెమోరియల్ మెడికల్ సెంటర్. తండ్రి రిటైర్డ్ ఆఫీసరు, హైదరాబాదు. స్వస్థలం కడప టౌన్. పోకనాటి రెడ్డి కుటుంబం.
2. 1981 మే నెల 22 జననం. (నూజివీడు). ఎత్తు 5'7". చదువు బి.ఇ., యం.యస్(ఇంగ్లాండ్). ఉద్యోగం ప్రాజెక్టు ఇన్‌ఛార్జి మొబైల్ న్యూటెక్నోలాజికల్ ప్రోగ్రామింగ్ ఇన్ నోకియా(ఫిన్‌లాండ్). జీతం నెలకు 3000యూరోస్. ఆస్తి విలువ 3కోట్లు. పంటరెడ్డి. తండ్రి వ్యాపారం, హైదరాబాద్.
3. 1981 ఫిబ్రవరి 25 జననం. ఎత్తు 5'8". చదువు బి.టెక్(కంప్యూటర్స్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్. సిజిబి టెక్ & సొల్యూషన్స్. పి.యన్.సి.బ్యాంకు పిట్స్‌బర్గ్(అమెరికా). జీతం నెలకు 7వేల డాలర్లు. తండ్రి స్వగ్రామం ప్రకాశం జిల్లా. మధ్యతరగతి మంచిరెడ్డి కుటుంబం. ఆస్తి విలువ 5కోట్లు.
4. 1982 ఆగష్టు 26 జననం(చెన్నై). ఎత్తు 5'5". చదువు బి.సి.ఎ(న్యూఢిల్లీ) యం.యస్.సి. కంప్యూటర్స్ నెట్‌వర్క్స్ (లండన్) ఉద్యోగం బ్రిటీష్ టెలికామ్స్, టెస్ట్ అనలిస్ట్, బిరిమింగమ్(లండన్). నెలకు జీతం రూ.2,50,000. ఉన్నతమైన రెడ్డి కుటుంబం స్వస్థలం చెన్నై, నెల్లూరు. ప్రస్తుత నివాసం ఢిల్లీ. ఆస్తివాటా 4కోట్లు.
5. 1983 ఏప్రిల్ 23 జననం(ఆత్మకూరు). ఎత్తు 6'1". చదువు బి.ఇ(కంప్యూటర్స్). ఉద్యోగం సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. హెచ్ఎస్‌బిసి గ్లోబల్ టెక్నాలజీస్, హైదరాబాద్. జీతం నెలకు రూ.60,000/-. ఆస్తి వాటా 1కోటి. మధ్యతరగతి పంటరెడ్డి. వ్యాపార కుటుంబం.
6. 1985 అక్టోబరు 3 జననం. ఎత్తు 5'4". చదువు బి.టెక్(సి.యస్.ఇ). ఉద్యోగం టి.సి.యస్, బెంగుళూరు. జీతం 40,000/-. స్వస్థలం నెల్లూరు జిల్లా. మధ్య తరగతి రైతు రెడ్డి కుటుంబం. ఆస్తి వాటా 40లక్షలు.
7. 1986 ఆగష్టు 21 జననం. ఎత్తు 5'4". చదువు బి.టెక్(ఇ.సి.ఇ). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఇన్‌ఫోసిస్ టెక్నాలజీస్ లిమిటెడ్. బెంగుళూరు. జీతం 60,000/-. ఆస్తి వాటా 5కోట్లు. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
8. 1991 అక్టోబర్ 14 జననం. ఎత్తు 5'2". చదువు బి.ఇ(కంప్యూటర్స్). స్వస్థలం నెల్లూరు జిల్లా. ఆస్తి వాటా 2కోట్లు. మంచి ఉన్నతమైన రెడ్డి రైతు కుటుంబం.
9. 1987 సెప్టెంబరు 2 జననం. ఎత్తు 5'3". చదువు బి.ఇ., యం.యస్.సి. డ్యూయెల్ డిగ్రీ. బిట్స్‌పిలాని, గోవా. స్వస్థలం వరంగల్ జిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్. తండ్రి అడ్వకేట్. ఆస్తి వాటా 3కోట్లు.
10. 1987 నవంబరు 16 జననం. ఎత్తు 5'2". చదువు బి.ఇ(బయోమెడికల్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఇన్‌ఫోసిస్ టెక్నాలజీస్ లిమిటెడ్, బెంగుళూరు. జీతం నెలకు రూ.40,000/-. ఆస్థివాటా 2కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా, ప్రస్తుత నివాసం హైదరాబాద్.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
పోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

# గూడూరు డివిజన్ వార్తలు

## మీ పనితీరు ఏడ్చినట్లే వుంది!

### గూడూరు సీమాంక్ సిబ్బంది తీరుపై డిఎం & హెచ్ఓ ఆగ్రహం



కాన్పు కోసం వచ్చిన మహిళలను ప్రశ్నిస్తున్న మాశిలామణి

ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి అమలుచేస్తుండగా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న సీమాంక్ సెంటర్‌లో కాన్పులు అతితక్కువగా జరగడం పట్ల జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి మాశిలామణి మండిపడ్డారు. సోమవారం ఆయన శ్రీహరికోట నుండి నెల్లూరు వెళుతూ గూడూరు ప్రభుత్వఆసుపత్రి సముదాయంలో గల సీమాంక్ సెంటర్‌లో తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ఈ సీమాంక్ సెంటర్‌లో జరగలేదని, నెలకు 150కాన్పులు చేయాల్సి వుండగా కేవలం 37కాన్పులు జరపడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అలాగే ఇటీవల 'రావమ్మ మహాలక్ష్మి', మార్పు కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 3రెట్లు అధికంగా కాన్పులు జరిగాయని, ఇది హర్షించదగ్గ పరిణామమని, డివిజన్ కేంద్రమైన గూడూరులో అతితక్కువగా కాన్పులు జరగడం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సీమాంక్ సెంటర్‌లో చిన్న పిల్లల ఆరోగ్యం కోసం న్యూబ్యాండ్ స్టెబిలైజేషన్ కేంద్రాన్ని 5లక్షల రూపాయలతో అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేశారని, ఇందుకోసం ప్రత్యేకంగా ఓ చిన్న పిల్లల వైద్యనిపుణుడిని కూడా ఏర్పాటు చేస్తామని, ఈ గదికి ఏసితో పాటు చిన్నారుల ఆరోగ్యం కోసం అన్నిరకాల ఆధునిక వసతులతో ఏర్పాటు చేశారని, సిబ్బంది కొరత కారణంగా దీనిని ఇంకా ప్రారంభించలేదని, ఉన్న సిబ్బందితోనే దీనిని త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 74ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి 64ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు, ఆపరేషన్లను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ వైద్యులు తాము తీసుకుంటున్న జీతాలకు ప్రజలకు మెరుగైన సేవలందించి వారికి ప్రభుత్వఆసుపత్రుల పట్ల నమ్మకం కలిగించాలన్నారు.

## పట్టణంలో అధ్వాన్నంగా పారిశుద్ధ్యం

### అవస్థలు పడుతున్న ప్రజలు



గూడూరు పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు పగలు, రాత్రి తేడా లేకుండా దోమలతో అవస్థలు పడుతున్నారు. గూడూరు పురపాలక సంఘానికి ప్రత్యేక అధికారిగా ఉన్న గూడూరు సబ్‌కలెక్టర్ అడపాదడపా పట్టణంలో పర్యటిస్తూ పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాలని చేస్తున్న సూచనలను ఇక్కడి మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఇటీవలే శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయడం జరిగింది. అయినా పరిస్థితిలో మార్పురాకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ప్రధాన వీధుల్లో మాత్రం రోడ్లను శుభ్రపరుస్తూ మురికివాడల్లో పారిశుద్ధ్యం గురించి పట్టించుకోకపోతుండటం వలన అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. పలుచోట్ల కాలువలను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో అందులో చెత్తచెదారాలు పేరుకొనిపోయి మురుగునీరు పోక నిల్వచేరి ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. పలుచోట్ల నిత్యం చెత్తను తీసుకొని వెళ్లాల్సిన వాహనాలు సకాలంలో రాకపోవడంతో పలుచోట్ల చెత్తపేరుకొని దుర్వాసన వెదజల్లుతున్నాయి. మున్సిపల్ అధికారులు మాత్రం తాము వీధులను శుభ్రం చేయిస్తున్నామని, వ్యాపారస్థులు, పట్టణ ప్రజలు తమకు సహకరించకుండా ఎక్కడపడితే అక్కడ చెత్తవేస్తున్నందున సకాలంలో తొలగించలేకపోతున్నట్టు పేర్కొనడం గమనార్హం. తమ వద్ద ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు పట్టణాన్ని శుభ్రంగా ఉంచే విషయంలో శ్రద్ధ తీసుకోనడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి కాలువల్లో చెత్త పేరుకొని కంపు కొడుతుంది. నివాసప్రాంతాల్లో ఈ విధంగా ఉండటంతో దోమలు స్వైరవిహారం చేస్తూ కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

## ఏప్రిల్ నుండి భూముల మార్కెట్ విలువలు పెంపు

### సబ్‌కలెక్టర్ నివాస్ వెల్లడి




అధికారులతో చర్చిస్తున్న సబ్‌కలెక్టర్ నివాస్

గూడూరు డివిజన్‌లో ఈ సంవత్సరం ఏప్రిల్1వతేదీ నుండి భూములు, ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయని గూడూరు సబ్‌కలెక్టర్ జె.నివాస్ వెల్లడించారు. ఈ నెల 16న స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని ఎంపిడివోలు, తహశీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనికి సబ్‌డివిజన్ పరిధిలో తాను ఛైర్మన్‌గా, సబ్‌రిజిస్ట్రార్లు కన్వీనర్లుగా, తహశీల్దార్లు, ఎంపిడివోలు మెంబర్లుగా వ్యవహరించనున్నారన్నారు. రిజిస్ట్రేషన్ల పెంపుపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏప్రిల్ 1వతేదీ నుండి గూడూరు డివిజన్‌లో భూముల మార్కెట్ విలువ ప్రకారం రిజిస్ట్రేషన్ చార్జీలు ఉంటాయన్నారు. ఈ ప్రతిపాదనలను డివిజన్‌లోని అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడివోల కార్యాలయాల్లో ప్రచురించడం జరుగుతుందన్నారు. గూడూరు డివిజన్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కారణంగా భూముల విలువలు పెరిగాయన్నారు. నెలరోజులపాటు ప్రతిపాదనలపై వచ్చిన అభ్యర్థనలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రక్రియ పూర్తయిన తరువాత వ్యవసాయ భూమి, నివాసిత ప్రాంతాల భూముల విలువలు తదితరాలను పరిగణలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ చార్జీలు నిర్ణయించనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపు డిఐజి సత్యనారాయణ జిల్లా రిజిస్ట్రార్ బాలప్ప, తహశీల్దార్లు, ఎంపిడివోలు పాల్గొన్నారు.

### జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు

## కంటి పరీక్షలు



పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నారి చూపు కార్యక్రమంలో భాగంగా సోమవారం గూడూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులలో దృష్టి లోపంతో పాటు తలనొప్పి ఉన్న వారిని పరీక్షించి వారికి అవసరమైన వైద్య చికిత్సలు చేశారు. కంటి చూపు కారణంగా ఎక్కువసేపు చదివితే తలనొప్పితో పాటు, కంటిలో నీరుకారడం వంటి వాటి గురించి వైద్యులు పరీక్షించి విద్యార్థులకు కళ్ళ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

# మూ'వీ'క్షణం






## ఐటంపై 'ప్రియం'

'చెన్నై ఎక్స్‌ప్రెస్' సినిమాలో కింగ్ ఖాన్ షారూఖ్ పక్కన ఐటంసాంగ్ చేయడం కోసం ప్రియమణి చాలా ఉత్సాహం చూపిస్తుంది. షారూఖ్‌ఖాన్, దీపికాపదుకొనే జంటగా నటిస్తున్న ఈ సినిమాకు రోహిత్‌శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియమణి ఐటమ్‌సాంగ్‌ను మహారాష్ట్ర సమీపంలో 'వాయ్' అనే ప్రదేశంలో చిత్రీకరించనున్నారు.



## 'జబర్‌దస్త్' నమ్మకం

సిద్ధార్థ 'జబర్‌దస్త్' సినిమా మీద కొండంత ఆశలు పెట్టుకున్నాడు. క్లాస్ హీరోగా పేరుబడ్డ సిద్ధార్థ ఈ సినిమా ద్వారా మాస్ కామెడీరోల్ చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం 'బావ' చిత్రంలో సిద్ధార్థ అకతాయి పాత్ర పోషించినా అది బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టింది. సిద్ధార్థను పూర్తిగా భిన్నంగా చూపించే ఈ సినిమా ఏ మాత్రం ఆడుతుందో చూడాలి!



## మూడుతరాల సినిమా

అక్కినేని వంశంలో మూడుతరాలకు చెందిన ఏఎన్ఆర్, నాగార్జున, నాగచైతన్యలు కలిసి నటిస్తే ఆ సినిమాను చూడడానికి ప్రేక్షకులు ఎగబడాల్సిందే. ఈ ముగ్గురి కాంబినేషన్‌లో ఓ సినిమాను దర్శకుడు విక్రమ్‌కుమార్ తెరకెక్కించనున్నారు. ఈ సినిమాకు 'మనం' అనే పేరు పరిశీలనలో వున్నట్లు తెలుస్తుంది.



## ప్రభాస్ కోసం ఆరేసాడు

టాలీవుడ్ బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తాను తీయబోయే 'బాహుబలి' సినిమా లొకేషన్స్ అన్వేషణలో భాగంగా ప్రస్తుతం రాజస్థాన్‌లో వున్నారు. ఆరు స్టోరీలను అన్వేషించాకే 'బాహుబలి'ని ఆయన ఎంపిక చేశారు.

## తీరు మారని లారెన్స్

లారెన్స్ ఒక సినిమాకి చేసిన టీమ్‌తో ఇంకో సినిమా చేయడు. 'ముని', 'కాంచన' సినిమాలకు సీక్వెల్‌గా 'ముని 3' తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాలో కూడా మొదటగా అనుకున్న విజయ్ ఆంథోనిని తీసేసి అనిరుధ్‌ని సంగీత దర్శకుడిగా పెట్టుకున్నాడు.



## 'ఇద్దరు' హీరోలు..

యంగ్‌టైగర్ ఎన్టీఆర్ 'బాద్షా', స్టైలిష్‌స్టార్ అల్లు అర్జున్ 'ఇద్దరమ్మాయిలు'తో సినిమాలు స్పెయిన్‌లో చిత్రీకరిస్తుండగా ఒకరిని ఒకరు కలుసుకున్నారు. ఈ రెండు చిత్రాలను బండ్ల గణేష్ నిర్మిస్తుండగా రెండు టీములు కూడా సరదాగా ఒకచోట కలిసాయి.



PDF Compressor Free Version




# కల్యాణ వైభవం!




ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మెన్ వంకి పెంచలయ్య - ప్రసూన్నల కుమార్తె **అరవింద - వెంకట్‌రామ్** (కె.వి.టి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మెన్ కె.వి.తిరుపతయ్య-సుశీలల కుమారుడు)ల కల్యాణం ఫిబ్రవరి 13వ తేదీ చెన్నైలోని హోటల్ ఐటిసి గ్రాండ్ ఛోళలో గ్రాండ్‌గా జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' అభినందనలు.



ప్రముఖ కాంట్రాక్టర్ మాగుంట వెంకటనారాయణరెడ్డి - రాజ్యలక్ష్మిల కుమారుడు **శరత్‌చంద్రారెడ్డి - సుస్మిత** (వెంకటాచలం మండలం ఇస్కపాళెం వాస్తవ్యులు బిరదవోలు విమలాకర్‌రెడ్డి - ధరణిజల కుమార్తె)ల వివాహం ఫిబ్రవరి 14వ తేదీ నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నూతనవధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



బిజెపి జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి - గీతాలతల కుమార్తె **అనూష - నందకిషోర్‌రెడ్డి** (లేట్ మనుబోలు శ్రీనివాసులురెడ్డి - దేవసేనమ్మల కుమారుడు)ల పరిణయం ఫిబ్రవరి 15వ తేదీ నెల్లూరు ఎంఎస్ఆర్ కల్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. నవవధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీఅధ్యక్షులు డా॥ జి.అశోక్ - డా॥ అహల్యాదేవిల కుమార్తె **డా॥ లక్ష్మీసుస్మిత - డా॥ చంద్రశేఖర్‌రెడ్డి** (కలువాయి వాస్తవ్యులు మునమల నరసింహారెడ్డి - సుజాతమ్మల కుమారుడు)ల పెళ్ళి ఫిబ్రవరి 14వ తేదీ నెల్లూరులోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపం నందు ఎంతో వేడుకగా జరిగింది. నూతనజంటకు 'లాయర్' శుభదీవెనలు.

### ప్రభుత్వం అనుమతిస్తే...

## 10కోట్లతో పాలిటెక్నిక్ కాలేజీ!

### ఎన్ఆర్ఐ డా॥ ప్రేమసాగర్‌రెడ్డి సంసిద్ధత



విద్యార్థిని చేతుల మీదుగా భవనాలను ప్రారంభింపజేస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, ఎస్పీ బి.వి.రమణకుమార్, పి.సుగుణాకర్‌రెడ్డి, బి.శ్రీహరిరెడ్డి

ప్రవాసభారతీయుడు, వెంకటాచలం మండలం నిడిగుంటపాలెం వాసి డాక్టర్ ననమాల ప్రేమసాగర్‌రెడ్డి 60లక్షల రూపాయలు దాతృత్వంతో నెల్లూరులోని డి.కె.ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులను ఈ నెల 17వ తేదీన జిల్లా కలెక్టర్ బి. శ్రీధర్, జిల్లా ఎస్పీ బి.వి.రమణ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు దాత ప్రేమసాగర్‌రెడ్డి చేస్తున్న సేవాకార్యక్రమాలను అభినందించారు. డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి ప్రతినిధి పైమాఘం సుగుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా అంటే ప్రేమసాగర్‌రెడ్డికి ఎంతో అభిమానమని, ఇక్కడ మంచిపనుల కోసం ఆయన ఎంత ఖర్చుకైనా వెనుకాడరని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీకి 50లక్షలు, చిన్నారుల గుండె ఆపరేషన్లకు 50లక్షలు గతంలోనే ఆయన విరాళంగా ఇచ్చివున్నారని, తన స్వగ్రామం నిడిగుంటపాలెంలో కోటిరూపాయలతో అభివృద్ధి పనులు చేసారని అన్నారు. ప్రభుత్వం అనుమతిస్తే 10కోట్ల రూపాయలతో స్థలాన్ని కొని పాలిటెక్నిక్ కాలేజీని కట్టించడానికి ప్రేమసాగర్‌రెడ్డి సిద్ధంగా వున్నారని సుగుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మమతా నర్సింగ్‌హోం అధినేత బద్దెపూడి శ్రీహరిరెడ్డి, భారత్ బిల్డర్స్ అధినేత టివిఎస్ చలపతిరావు, కళాశాల ప్రిన్సిపాల్ శారద, అధ్యాపకులు పాల్గొన్నారు.

### జనం మెచ్చిన వై.యస్. పాలన...

## జగన్‌తోనే సాధ్యం

### అట్టహాసంగా ప్రారంభమైన కాకాణి 'దీవెనయాత్ర'



ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి సువర్ణయుగం మళ్ళీ రాష్ట్రంలో రావాలంటే వైయస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం టిపి గూడూరు మండలం కోడూరులో గడపగడపకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నినాదంతో దీవెనయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా స్టీరింగ్ కమిటి సభ్యుడు చిల్లకూరు సుధీర్‌రెడ్డి అధ్యక్షతన పంచాయితీ కార్యాలయం కూడలి వద్ద జరిగిన బహిరంగ సభలో కాకాణి మాట్లాడుతూ రాజన్న రాజ్యం సాధించేందుకు దీవెన యాత్ర సాగిస్తున్నట్లు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్, టీడిపి కుట్రల వల్లే అన్యాయంగా జగన్‌ను జైలులో పెట్టారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా త్వరలో ఆయన బయటకు రావడం తథ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో వైయఎస్సార్‌సిపి పార్టీ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలను, రెండు ఎంపి స్థానాలను అత్యధిక మెజారిటీతో కైవసం చేసుకుంటుందన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కొమ్మిలక్ష్మయ్యనాయుడు, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, అనిల్‌కుమార్ యాదవ్, సంక్రాంతి కళ్యాణ్, శింగంశెట్టి భాస్కర్, పులిమి శైలజ, పాశం సునీల్ కుమార్, కావలిరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, పర్వతరెడ్డి విశ్వనాథరెడ్డి, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లునాయుడు, బాలకొండయ్య, అనిత, బాలచెన్నయ్య, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## 28న సిఎం 'ఇందిరమ్మ బాట'

నెల్లూరుజిల్లాలో ఈనెల 28వతేదీన ఇందిరమ్మ బాట కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రి నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో ఏర్పాటుచేసే వైద్య కళాశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఇందిరమ్మ బాటలో భాగంగా సిఎం జిల్లాకు రానున్నారని, మూడురోజులు పాటు ఇక్కడే పర్యటిస్తారన్నారు. 781 కోట్లతో సోమశిల హైలెవల్స్ కెనాల్ నిర్మాణం, 365కోట్లతో వైద్యకళాశాల నిర్మాణాలు జరుగనున్నాయని తెలిపారు. అలాగే ఆసుపత్రి ఆవరణంలో నూతనంగా నిర్మించిన సెంట్రల్ డ్రగ్ స్టోర్, వంద పడకల చిన్న పిల్లల ఆసుపత్రిని సిఎం ప్రారంభిస్తారని తెలిపారు. ఈ పర్యటనలో ఆయన వెంట నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కూడా పాల్గొన్నారు.




అమ్మ ఫర్నిచర్ వారి
అమ్మ ఫర్నిచర్‌మాల్
మినీబైపాస్‌రోడ్డు, నెల్లూరు.
ప్రపంచస్థాయి మోడల్స్
ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్

సత్యంజీ
సింహపురి సిటి
అందమైన గ్రీన్ పార్క్
వి.జి.ఆర్. స్కూల్ దగ్గర, ధనలక్ష్మీపురం, మెయిన్ రోడ్డు, ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు.



డ్యూప్లెక్స్ హౌస్
ప్రారంభం ధర 39 లక్షలు
మొదటి ఇద్దరికి 5 లక్షల విలువ గల ప్లాటు గిఫ్ట్‌గా ఇవ్వబడును.
ఈ హౌస్ పూర్తి అయిన తరువాత ఖచ్చితమైన ధర 49 లక్షలు



డబుల్ బెడ్ రూం హౌస్
ప్రారంభం ధర 34 లక్షలు
మొదటి ఇద్దరికి 5 లక్షల విలువ గల ప్లాటు గిఫ్ట్‌గా ఇవ్వబడును.
ఈ హౌస్ పూర్తి అయిన తరువాత ఖచ్చితమైన ధర 44 లక్షలు

మీ వివరములు తెలియుటకు You Tube R.R., S.Tv., Gem Channels చూడండి.
శుక్రవారం 7.30 P.M.
శనివారం 10.30 A.M.
7.30 P.M.
ఆదివారం 10.30 A.M.

బ్యాంకు లోన్ సౌకర్యం కలదు
9133 222 558
0861-2318286, 2341183
08622272555
www.satyamglanddevelopers.org
e-mail : jayasankar441@yahoo.com

PDF Compressor Free Version






Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.